# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 89 పేజీలు : 08, వెల రూ. 5రూ/ మంగళవారం- 01 - ఏప్రిల్ - 2025


## అక్కడ 400 ఎకరాల భూమిని అమ్మడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా: కేటీఆర్

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వాన్ గార్డ్ సంస్థ సీఈవో, ప్రతినిధులు

- హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వాన్ గార్డ్ సీఈవో వెల్లడి
- దేశంలోనే తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో స్థాపించనున్నట్లు వెల్లడి
- 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్న సీఈవో


2లో

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో వాన్ గార్డ్ సంస్థ సీఈవో సమావేశమయ్యారు. అనంతరం సీఈవో మరియు కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దేశంలోనే మొట్టమొదటి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో స్థాపించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యాలయం అందుబాటులోకి వస్తే దాదాపు 2,500 మందికి

## స్థానిక ఎన్నికలపై ఫోకస్.. బీజేపీ టార్గెట్ ఫిక్స్


2

- ఓటేసిన ప్రజలకు వెన్నుపోటు పొడిచేందుకూ రేవంత్ ప్రభుత్వం చూస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు.
- రైతు, విద్యుత్ కోతలు, నిరుద్యోగ సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని
- స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు.

(KTR story)

- ఆఫ్ షోర్ మైనింగ్ టెండర్లపై రాహుల్ స్పందన
- సముద్ర జీవులకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన
- "కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ తీరాల్లో సముద్ర గనుల తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిన నిర్ణయాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను"



ఢిల్లీ : పర్యావరణ ప్రభావాలను అంచనా వేయకుండా అనుమతులు ఎలా ఇస్తారని విమర్శలు కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవుల సముద్ర తీరాల్లో (ఆఫ్ షోర్ మైనింగ్) తవ్వకాలకు అనుమతిస్తూ జారీ చేసిన టెండర్లను రద్దు చేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఆఫ్ షోర్ మైనింగ్ వల్ల సముద్ర జీవులకు ముప్పు వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభావాలను క్షుణ్ణంగా అంచనా వేయకుండా ప్రైవేట్ సంస్థలకు సముద్ర గనుల తవ్వకాల కేటాయింపులు చేయడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. "కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ తీరాల్లో సముద్ర గనుల తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిన నిర్ణయాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ప్రధాన మంత్రికి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. మిగతా..2లో

## 2029లోనూ మోదీనే ప్రధాని: సీఎం ఫడ్నవిస్

- మహారాష్ట్ర నుంచి మోదీ వారసుడు వస్తారంటూ సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలపై ఫడ్నవిస్ స్పందిస్తూ... "మోదీనే మా నేత.
- మన సంస్కృతిలో తండ్రి బతికుండగా వారసుని గురించి మాట్లాడం. అది మొఘలుల సంస్కృతి.
- మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అన్నారు. మోదీకి వారసుడిని అన్వేషించాల్సిన అవసరమే లేదని,


2లో

ముంబై: దేశానికి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీఇంకా చాలా ఏళ్లు నాయకత్వం వహిస్తారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అన్నారు. మోదీకి వారసుడిని అన్వేషించాల్సిన అవసరమే లేదని, 2029లోనూ మోదీని ప్రధానమంత్రిగా మనం చూస్తామని చెప్పారు. మోదీ సెప్టెంబర్‌లో రిటైర్‌మెంట్ కావాలనే ఆలోచనతో నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి మోహన్ భగవత్‌ను కలిసారని శివసేన (యూబీటీ)నేత సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలను ఫడ్నవిస్ కొట్టివేశారు. మిగతా..2లో

## అలకలు వద్దు.. కష్టపడి పనిచేయండి

- కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ
- ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని, అధైర్యపడవద్దని హామీ
- పార్టీ కేడర్ అంతా ప్రతీ మూడు నెలలకు ఒకసారి ప్రజల్లోకి వెళ్లాలన్నారు.
- జగన్ పై కంటే పార్టీ కార్యకర్తల కోసమే తాను ఎక్కువగా పోరాడుతుంటానని వెల్లడించారు.


2

అనకాపల్లి, మార్చి 31: అందరం కలిసి పోరాడి ఆంధ్రప్రదేశ్‌లో చరిత్ర తిరిగి రాశామని..164 స్థానాలు కైవసం చేసుకున్నామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి , మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం యలమంచిలి నియోజకవర్గంలో కార్యకర్తలు, నేతలతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మిగతా..2లో

## విశాఖ బ్రాండ్‌ను పరుగులెత్తిస్తాం


2లో

విశాఖ

బీచ్ రోడ్డులో ఓ స్టార్ హెూటల్‌కు మంత్రి లోకేశ్ భూమిపూజ

హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

వైజాగ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

"బ్రాండ్ బాబు నినాదం ఎప్పుడైతే తిరిగి వచ్చిందో అప్పుడే విశాఖ బ్రాండ్ అత్యున్నత శిఖరాలకు దూసుకెళ్లింది.

విశాఖపట్నం : విశాఖ బ్రాండ్‌ను నిలబెట్టుకునేందుకు సర్కార్ ఎంతో కృషి చేస్తోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం రాకతో గతంలో పెట్టుబడులు పెట్టమని తిరిగి వెళ్లిపోయిన వారు కూడా ఇప్పుడు ముందుకొస్తున్నారని చెప్పారు. టీసీఎస్? కొద్ది రోజుల్లో ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో ముందుకు

## ఏపీ సర్కార్ కీలక ప్రకటన.. ఆ 51 మండలాలు..

**స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న కూటమి ప్రభుత్వం కరువు మండలాలపై దృష్టి**

**37 మండలాల్లో తీవ్రమైన కరువు ఉన్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు.**

**2024-25 కరువు మండలాలను వెల్లడిస్తూ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ**



2లో

అమరావతి: గత ఏడాది ఏపీలో సాధారణ స్థాయిలో కూడా వర్షాలు పడలేదు.. అయితే గత జగన్ ప్రభుత్వం మాత్రం కరువు మండలాలను ప్రకటించడంలో నిర్లక్ష్యం చేసింది. మొక్కుబడిగా కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకుంది. రైతుల ఇబ్బందులను, స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న కూటమి ప్రభుత్వం కరువు మండలాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే కరువు మండలాలపై కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

### ఆ నివేదిక ఆధారంగా..

ఏపీలో కరువు మండలాలుగా 51 మండలాలను ప్రకటించారు. 37 మండలాల్లో తీవ్రమైన కరువు ఉన్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు. 14 మండలాల్లో కరువు ప్రభావం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రబీ సీజన్ 2024-25 కరువు మండలాలను వెల్లడిస్తూ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిర్వహించిన కరువు ప్రభావ కమిటీ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కరువు ప్రభావ కమిటీ నిశితంగా పరిశీలించింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను తాము దృష్టిలో ఉంచుకుని, వర్షపాతం లోటు, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సిసోడియా ప్రకటించారు.

## రాష్ట్రంలో రెండే రెండు బంగారు కుటుంబాలు ఉన్నాయి

- చంద్రబాబు ఎంత సంపద సృష్టించారో చెప్పాలన్న అంబటి
- పీ4 పేరుతో అందరినీ ఏప్రిల్ ఫూల్ చేశారని వ్యాఖ్య
- రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కుటుంబాలే బంగారు కుటుంబాలని విమర్శ


2

అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి విమర్శలు గుప్పించారు. సంపద సృష్టిస్తామని చంద్రబాబు చెప్పారని... ఈ తొమ్మిది నెలల పాలనలో ఎంత సంపద సృష్టించారో చెప్పాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలోని పథకాలకు కూడా పాతర వేశారని మండిపడ్డారు. పీ4 పేరుతో రాష్ట్ర ప్రజలందరినీ చంద్రబాబు ఏప్రిల్ ఫూల్ చేశారని చెప్పారు. పేదలను మరింత పేదలుగా చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ సీట్లను డబ్బున్నోళ్లకు ఇస్తున్నారని దుయ్యబట్టారు. వైద్య కళాశాలలు, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు, పోర్టులను ప్రైవేటు పరం చేస్తున్నారని ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వంలో 58 కార్పొరేషన్లను

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వాన్ గార్డ్ సంస్థ సీఈవో, ప్రతినిధులు

ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐ, డేటా సెంటర్, మొబైల్ ఇంజినీరింగ్ రంగాల్లో నిపుణులకు తమ సంస్థల్లో అవకాశాలు లభిస్తాయని వాన్ గార్డ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకర విధానాల వల్లే హైదరాబాద్‌ను ఎంచుకున్నట్లు వారు తెలిపారు. అంతేకాకుండా, అన్ని రంగాల నిపుణులు హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నారని వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ కేపబులిటీ సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

# ఆఫ్ షోర్ మైనింగ్ టెండర్లపై రాహుల్ స్పందన

పర్యావరణ ప్రభావాలను అంచనా వేయకుండా సముద్ర గనుల తవ్వకాల టెండర్లను జారీ చేసిన విధానానికి వ్యతిరేకంగా తీర ప్రాంత ప్రజలు నిరసన తెలుపుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దీనివల్ల తమ జీవనోపాధి, జీవన విధానంపై ప్రభావం చూపుతుందని లక్షలాది మంది మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. 2023లో సవరించిన ఆఫ్ షోర్ ఏరియాస్ మినరల్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) చట్టంపై తీవ్ర అభ్యంతరాలు ఎదుర్కొన్నాయని రాహుల్ గాంధీ తెలిపారు. ఆఫ్ షోర్ మైనింగ్ వల్ల సముద్ర జీవులకు ముప్పు, పగడపు దిబ్బలకు నష్టం మరియు చేపల నిల్వలు తగ్గిపోవడం వంటి ప్రతికూల ప్రభావాలు కలుగుతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో రెండే రెండు బంగారు కుటుంబాలు ఉన్నాయి

ప్రైవేటు పరం చేసిన ఘనత చంద్రబాబుదని చెప్పారు. పీ4 పేరుతో డబ్బులు ఉన్నవాళ్లని, బడా బాబుల్ని వేదికపై కూర్చోబెడుతున్నారని అన్నారు. గతంలో జన్మభూమి, శ్రమదానం అని ప్రచారం చేసుకున్న చంద్రబాబు... ఇప్పుడు పీ4 పేరుతో ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రెండే రెండు బంగారు కుటుంబాలు ఉన్నాయని... ఒకటి చంద్రబాబుది, మరొకటి పవన్ కల్యాణ్ దని అంబటి దుయ్యబట్టారు. పుట్టినప్పటి నుంచి చంద్రబాబు చేసినవన్నీ తప్పులేనని అన్నారు. ఎన్టీఆర్ దగ్గర పని చేసి... ఆయన పని పూర్తి చేశారని విమర్శించారు. లోకేశ్ లాంటి అసమర్థుడిని ప్రజలపై రుద్దాలని ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. లోకేశ్ డబ్బులు వసూలు చేసి పవన్ కు ప్యాకేజ్ ఇస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లాయని... ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు దగ్గరపడిందని చెప్పారు.

# 2029లోనూ మోదీనే ప్రధాని: సీఎం ఫడ్నవిస్

మోదీ ఆ ప్లాన్‌తోనే ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి వెళ్లారేమో..

మహారాష్ట్ర నుంచి మోదీ వారసుడు వస్తారంటూ సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలపై ఫడ్నవిస్ స్పందిస్తూ... "మోదీనే మా నేత. అలాగే ఆయన కొనసాగుతారు. మన సంస్కృతిలో తండ్రి బతికుండగా వారసుని గురించి మాట్లాడం. అది మొఘలుల సంస్కృతి. దానిపై (మోదీ వారసత్వంపై) చర్చించేందుకు ఇంకా సమయం రాలేదు" అని అన్నారు.

## భయ్యాజీ జోషి ఏం చేప్పారంటే?

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను మోదీ కలుసుకోవడం, మహారాష్ట్ర నుంచి మోదీ వారసుడు ప్రధాని కానున్నారనే ఊహాగానాలపై ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత సురేష్ భయ్యాజీ జోషి స్పందించారు. అలాంటి సమాచారం ఏదీ తనవద్ద లేదని, అలాంటి సంభాషణలు జరిగినట్టు కూడా తనకు తెలియదని చెప్పారు. కోవిడ్ సమయంలో మోదీ అందించిన సేవలు, సంఘ్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ జయంతికి స్వయంసేవక్‌గా ఆయన హాజరుకావడం చాలా చక్కగా ఉందని ప్రశంసించారు.

# వ్యూహాత్మక బలిమికి వాషింగ్టన్‌తో చెలిమి

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. అప్పుడే ఆయన ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా యాత్రకు రంగం సిద్ధం చేశారు. ఆ వెంటనే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశంలోనూ జైశంకర్ పాల్గొన్నారు. తరవాత ప్రధాని మోదీ వాషింగ్టన్ వెళ్లి అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తోనూ భేటీ అయ్యారు. ప్రపంచ రాజకీయాల్లో తన సైనిక, ఆర్థిక, రాజకీయ పాత్రపై అగ్రరాజ్యం అమెరికా పునర్విమర్శ చేసుకుంటోంది. ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ జాతీయ, అంతర్జాతీయ విధానాలను సమూలంగా మార్చేందుకు ఉపక్రమించారు. ఇలాంటి తరుణంలో వాషింగ్టన్‌తో భారత్ ఎలా మెలగాలి? అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. అప్పుడే ఆయన ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా యాత్రకు రంగం సిద్ధం చేశారు. ఆ వెంటనే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశంలోనూ జైశంకర్ పాల్గొన్నారు. తరవాత ప్రధాని మోదీ వాషింగ్టన్ వెళ్లి అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తోనూ భేటీ అయ్యారు. ఇంకా అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ సంస్థల డైరెక్టర్ తులసీ గాబర్డ్, ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి, జాతీయ భద్రతా సలహాదారు మైకేల్ వాల్ట్జ్ తదితర ముఖ్యులతో సమావేశమయ్యారు. తద్వారా ట్రంప్, ఆయన పాలనా బృందం మనస్తత్వాన్నీ, విధానాలనూ అర్థం చేసుకోవడం ప్రధాని మోదీకి వీలైంది. స్పష్టమైన అజెండాతో అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఆయన బృందం- సత్వరమే దాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

## ఉభయతారక ఒప్పందాలు

గత ప్రభుత్వాలు అడ్డూఆపూలేని ప్రపంచీకరణ విధానాలు చేపట్టడంవల్ల అమెరికాలో పారిశ్రామికోత్పత్తి బాగా దెబ్బతిందని ట్రంప్ భావిస్తున్నారు. తమ గడ్డపైకి ఇబ్బడిముబ్బడిగా వలసలు రావడం వల్ల అమెరికన్ల విలక్షణ అస్తిత్వం ప్రమాదంలో పడిందంటున్నారు. అమెరికాకు పూర్వ వైభవం తీసుకురావాలంటే వలస విధానాలను సమూలంగా సంస్కరించడంతో పాటు, అధిక సుంకాలు విధించడం ఆవశ్యకమని ఆయన నమ్ముతున్నారు. విదేశీ దిగుమతులను తగ్గించి, స్వదేశీ ఉత్పత్తిని పెంచే మార్గంగా అధిక సుంకాలను పరిగణిస్తున్నారు. నేడు అమెరికా రాజకీయాల్లో సుంకాలు, వలసలే ప్రధానాంశాలుగా మారాయి. ఈ క్రమంలో అక్రమ వలసదారులకు సంకెళ్లు వేసి విమానాల్లో ఇండియాకు తరలిస్తున్నా, గట్టిగా ఖండనలు వినపడలేదు! అమెరికాతో వాణిజ్యం సాగిస్తున్న పది ప్రధాన దేశాల్లో ఇండియా ఒకటి. మన దేశానికి వాషింగ్టన్‌తో వాణిజ్య మిగులే ఉంది తప్ప, లోటు లేదు. దీన్ని చెడగొట్టుకోకూడదని దిల్లీ భావిస్తోంది. ఇండియా తమ వస్తువులపై అధిక సుంకం విధిస్తోందని, దానివల్ల అమెరికా కంపెనీలు భారతీయ మార్కెట్లో ప్రతికూలతను ఎదుర్కొంటున్నాయని ట్రంప్ ఆరోపిస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో అమలులోకి వచ్చేలా ప్రతీకార సుంకాలనూ ఆయన ప్రకటించారు కూడా. మోదీ పర్యటనలో భారతీయ ప్రతినిధి బృందం సుంకాల ఊసు ఎత్తకుండా సంయమనం పాటించింది. కానీ, ఆ పర్యటన ముగింపులో విడుదలైన సంయుక్త ప్రకటన మాత్రం- వాణిజ్యపరమైన తేడాపాడాలను పరిష్కరించుకోవడానికి రెండు దేశాలు చర్చించినట్లు తెలిపింది. ఈ ఏడాది చివరికల్లా ఉభయతారకమైన వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోనున్నట్లు వెల్లడించింది.

## సాంకేతికతల్లో సహకార వృద్ధికి...



రానున్న అయిదేళ్లలో భారత్-అమెరికా వాణిజ్యాన్ని 50వేల కోట్ల డాలర్లకు తీసుకెళ్లాలని నేతలు నిశ్చయించారు. అగ్రరాజ్యం నుంచి మరింత చమురు, వంట గ్యాస్‌తో పాటు ఇతర ఇంధన వాయువులను దిగుమతి చేసుకోవాలని ఇండియా భావిస్తోంది. దీనివల్ల రెండు దేశాల వాణిజ్య పరిమాణం పెరుగుతుంది. చిన్నపాటి ఆధునిక మాడ్యులర్ అణు రియాక్టర్ల ద్వారా భారత్‌లో అణు విద్యుదుత్పాదనను పెంచాలని నిర్ణయించారు. అధిక పెట్టుబడులు, వినూత్న విధానాలతో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించుకోవాలని భారత్, అమెరికాలు భావిస్తున్నాయి. అక్రమంగా అమెరికాలో ఉంటున్న భారతీయుల్ని వెనక్కి తీసుకోవడానికి దిల్లీ అంగీకరించింది. వారిని సంకెళ్లతో బంధించి పంపడం గురించి ప్రభుత్వం బహిరంగంగా విమర్శించలేదు. కానీ విద్యార్థులు, వృత్తి నిపుణుల వలసలను మరింత క్రమబద్ధం చేయడానికి అమెరికాతో చర్చలు జరుపుతోంది. సాంకేతిక పరిజ్ఞానం, నవీకరణల విషయంలో మోదీ-ట్రంప్ భేటీ గణనీయ ఫలితాలిస్తోంది. సెమీ కండక్టర్లు, క్వాంటమ్ సాంకేతికత, ఇంధన, అంతరిక్ష తదితర అత్యాధునిక టెక్నాలజీల్లో సహకార వృద్ధికి ప్రత్యేక ఒప్పందం కుదిరింది. అరుదైన ఖనిజ వనరులు, వస్తు సరఫరా గొలుసుల్లోనూ సహకారం పెంపొందించుకోవాలని రెండు దేశాలు నిశ్చయించాయి. రక్షణ రంగంలోనూ ఉభయ దేశాల మధ్య సహకారం బలపడనుంది. ఆయుధాల సంయుక్త ఉత్పత్తి, ఆయుధ పరిశ్రమల మధ్య సహకార వృద్ధికి చర్యలు తీసుకోనున్నారు. ట్యాంక్ విధ్వంసక జావెలిన్ క్షిపణులు, సైనిక శకట వాహనాలను ఉమ్మడిగా తయారు చేయాలని తలపెట్టారు. అమెరికా నుంచి అదనంగా ఆరు పీ81 సముద్ర నిఘా విమానాలను భారత్ కొనుగోలు చేయనుంది. భారత్‌కు అమెరికా ఆయుధ విక్రయాలు 20వేల కోట్ల డాలర్లకు పెరిగాయి. ఇండియా నుంచీ అక్కడికి ఆయుధ ఎగుమతులు పెరగడం విశేషం. భద్రతా సమస్యలకు పరిష్కారాలు ట్రంప్ అధ్యక్షుడైన తరవాత ఐరోపా మిత్రులతో సంబంధాల బలోపేతం... రష్యా-ఉక్రెయిన్, హమాస్-ఇజ్రాయెల్ యుద్ధాలపై ప్రధానంగా దృష్టి సారిస్తారని భావించారు. కానీ, ఉక్రెయిన్ విషయంలో ఐరోపా మిత్రులతో అగ్రరాజ్యానికి పొరపొచ్చాలు వచ్చాయి. ట్రంప్ బాధ్యతలు చేపట్టడంతోనే భారత్, జపాన్, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రులతో 'క్వాడ్' సమావేశాన్ని ఏర్పాటుచేశారు. మొత్తం నలుగురు విదేశీ నాయకులతో ఆయన భేటీ కాగా, వారిలో ఇద్దరు భారత్, జపాన్ ప్రధానులే! ఏతావతా ద్వైపాక్షికంగానే కాకుండా, అంతర్జాతీయంగానూ భారత్-అమెరికా బంధం బలపడనుంది. కాబట్టి, అమెరికా సుంకాలు, వలసల విషయంలో విభేదించడం కంటే- పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్‌ల నుంచి పొంచి ఉన్న భద్రతాపరమైన సమస్యలపై వాషింగ్టన్‌తో సహకారం పెంచుకోవడానికే దిల్లీ ప్రాధాన్యమివ్వడం మేలు. అంతర్జాతీయ సమీకరణాలు మారుతున్న క్రమంలో ప్రజాస్వామ్య దేశాలైన భారత్-అమెరికా బంధం కీలక పాత్ర పోషించనుంది.

# అలకలు వద్దు.. కష్టపడి పనిచేయండి

మొదటి పేజి తరువాయి




జూన్ నుంచి మనం సాధించిన విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. భిన్నాభిప్రాయాలు ఉన్నా అందరూ కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తకే అగ్రతాంబూలమని, ఆ తర్వాతే ఎవరైనా అని స్పష్టం చేశారు. తొలిసారి అవకాశం రాకపోయినా మూడు విడతల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని, అధైర్యపడవద్దని హామీ ఇచ్చారు. అలకలుమాని పార్టీ కోసం పని చేయాలని కోరారు. మే తర్వాత కేడర్ అంతా ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. మే నెలలో కడపలో మహానాడు నిర్వహించబోతున్నామని తెలిపారు. మహానాడులో జాతీయ అధ్యక్షుడి ఎన్నిక తర్వాత రాష్ట్ర కమిటీ నియమాకం చేపడతామన్నారు. పార్టీ కేడర్ అంతా ప్రతీ మూడు నెలలకు ఒకసారి ప్రజల్లోకి వెళ్లాలన్నారు. జగన్ పై కంటే పార్టీ కార్యకర్తల కోసమే తాను ఎక్కువగా పోరాడుతుంటానని వెల్లడించారు. ఇకపై నిరంతరం యువరక్తం ఎక్కిస్తామన్నారు. ఏ నాయకుడు కూడా ఒకే పదవిలో మూడుసార్లకు మించి ఉండకూడదని ప్రతిపాదిస్తున్నామన్నారు. గ్రామస్థాయి అధ్యక్షుడికి కూడా పొలిట్‌బ్యూరోలో స్థానం లభించే పరిస్థితి రావాలని తెలిపారు. పార్టీలో కరుడుగట్టిన కార్యకర్తలంతా అయిదేళ్లు నరకం అనుభవించారని.. ఎన్నో కేసులుపెట్టి హింసించారన్నారు.

ప్రత్యేక విమానంలో ముంబైకి కొడాలి నాని.. కారణమిదే

ఇతర పార్టీ ఎమ్మెల్యే ఉన్నచోట సమన్వయ లోపం కారణంగా సమస్యలు వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే లేనిచోట అక్కడ ఇన్‌చార్జి ప్రతివారం కూర్చుని మాట్లాడుకోవాలని సూచించారు. చట్టపరిధిలోని పనుల కోసం కార్యకర్తలు కార్యాలయాలకు వెళితే పనులు చేయాల్సిందే అని తెలిపారు. తప్పుడు కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ సర్పంచ్‌లతో పాటు 10 శాతం వైసీపీ వారు కూడా టీడీపీ సభ్యత్వ కార్డులు తీసుకున్నారని అన్నారు. తప్పుడు కేసులకు సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని సంప్రదించాలని మంత్రి లోకేష్ తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ దామచర్ల సత్య, యలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వారిని ఇబ్బంది పెట్టొద్దు..

# సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

మొదటి పేజి తరువాయి




హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వివాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని వేధింపులకు గురిచేసి పాసులు అడిగిన విషయంపై వివరాలు సేకరించారు. ఈ మేరకు సీఎంఓ కార్యాలయం ముఖ్యమంత్రితో చర్చించింది. అనంతరం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని పాసుల విషయంలో బెదిరించిన అంశంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని పాసుల కోసం ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మధ్య వైరం నెలకొన్న విషయం తెలసిందే. ఫ్రీ పాసుల కోసం తమను వేధిస్తోందని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఆరోపించింది. దీంతో హైదరాబాద్‌ను వీడి వెళ్లిపోతామని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం తెలిపింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధి లేఖ రాశారు. హెచ్‌సీయూ అధ్యక్షుడు జగన్మోహనరావు ఫ్రీ టికెట్స్ కోసం తమను వేధిస్తున్నారంటూ లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే పదిశాతం టికెట్లు ఇస్తున్నామని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం స్పష్టం చేసింది. టికెట్ల కోసం బెదిరిస్తూ మ్యాచ్‌కు ముందు.. కార్పొరేట్ బాక్స్‌లకు తాళం వేశారని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం తెలిపింది. ఐపీఎల్ కోసం స్టేడియం అద్దె మొత్తం చెల్లిస్తున్నా.. %ఎజాూ% పెత్తనం చేయాలని చూస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అపెక్స్ కౌన్సిల్‌తో చర్చలకు ఏర్పాటు చేయాలని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం కోరింది. చర్చలు సఫలం కాకపోతే బీసీసీఐతో చర్చించి వేదికను మార్చుకుంటామని సన్‌రైజర్స్ హైదరాబాద్ తేల్చిచెప్పింది.

# స్థానిక ఎన్నికలపై ఫోకస్.. బీజేపీ టార్గెట్ ఫిక్స్

మొదటి పేజి తరువాయి



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఇవాళ(సోమవారం) హైదరాబాద్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన పదాధికారుల సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు హాజరయ్యారు. కీలక అంశాలపై కిషన్‌రెడ్డి చర్చించారు. సంస్థాగత వ్యవహారాలపై కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. మిగిలిన జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు పూర్తి చేయాలని చర్చించారు. రేవంత్ ప్రభుత్వంపై ప్రజల తరపున పోరాటాలకు సిద్ధం చేసేలా బీజేపీ కేడర్‌కు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆరు గ్యారెంటీలపైన రైతుల తరపున పోరు బాట పట్టేలా తీసుకోవాల్సిన చర్యలపై కిషన్‌రెడ్డి చర్చించారు. రాష్ట్రంలోని ప్రజలు ఇప్పుడు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. బీజేపీ నేతలు ఇంకా పోరాటాలు చేయాలని, అధికారంలోకి రావాలని ఎదురు చూస్తున్నామని అన్నారు. టీచర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము గెలిచామని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేసినా రెండు సీట్లు తాము గెలిచామని అన్నారు. గత బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పోటీ చేయలేదని.. కాంగ్రెస్ ఎన్నికల ముందే చేతులు ఎత్తేసిందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఓటేసిన ప్రజలకు వెన్నుపోటు పొడిచేందుకూ రేవంత్ ప్రభుత్వం చూస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేయాలని .. పోరాటాలకు సిద్ధం కావాలని బీజేపీ కేడర్‌కు పిలుపునిచ్చారు. కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఉందని అన్నారు. పోరాటాల ద్వారా పార్టీని పటిష్టం చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కమిటీలను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసుకోవాలని చెప్పారు. అంబేడ్కర్ జయంతి సమయం లోపుల కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. వందశాతం బూత్, మండల కమిటీలు పూర్తి చేసుకోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. రైతు, విద్యుత్ కోతలు, నిరుద్యోగ సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని చెప్పారు. యువమోర్చా, మహిళా సమస్యలపై మహిళా మోర్చా పోరాటాలు చేయాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలవాలనే నినాదంతో ముందుకు పోవాలని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం అవుతూనే, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# విశాఖ బ్రాండ్‌ను పరుగులెత్తిస్తాం: మంత్రి లోకేశ్

మొదటి పేజి తరువాయి



విశాఖ బీచ్ రోడ్డులో ఓ స్టార్ హొటల్‌కు భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు తల్లి భువనేశ్వరితో కలిసి హొటల్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. విశాఖపట్నం చుట్టుపక్కల ఐదు లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. విశాఖ ఒక ఐకానిక్ కాపిటల్?గా అవతరిస్తోందని చెప్పారు. అదేవిధంగా టాటా పవర్ కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. భోగాపురం ఎయిర్?పోర్ట్ కొద్దీ నెలలో అందుబాటులోకి వస్తుందని లోకేశ్ వివరించారు. "బ్రాండ్ బాబు నినాదం ఎప్పుడైతే తిరిగి వచ్చిందో అప్పుడే విశాఖ బ్రాండ్ అత్యున్నత శిఖరాలకు దూసుకెళ్లింది. విశాఖ బ్రాండ్‌ను నిలబెట్టుకునేందుకు సర్కార్ ఎంతో కృషి చేస్తోంది. వైజాగ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దేశంలో ఏపీలో తప్ప ఎక్కడైనా పెట్టుబడులు పెడతామని బహిరంగంగా ప్రకటించిన లూలూ సంస్థ సైతం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోంది. ఎన్నికోట్లు పెట్టుబడులు వస్తున్నాయోనన్నది కాదు. ఎంతమందికి ఉపాధికి కల్పిస్తున్నామో అన్నదే ముఖ్యం. వరుణ్ గ్రూప్ నిర్మించే ఈ హొటల్‌లో ఆఫీస్ స్పేస్ ఏర్పాటు నాలో మరింత ఉత్సాహాన్ని నింపింది. వారికి హామీ ఇస్తున్నాను. రెండేళ్లలో వారి ఆఫీస్ స్పేస్ మొత్తం నిండిపోవడం ఖాయం." - లోకేశ్, మంత్రి వరుణ్ గ్రూప్? రాకతో విశాఖపట్నం రూపురేఖలు మారనున్నాయని కేంద్ర మంత్రి రామ్మోహన్?నాయుడు తెలిపారు. చంద్రబాబు, లోకేశ్‌కు విశాఖపై అమితమైన ప్రేమ ఉందని చెప్పారు. పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు ముందుకొచ్చినా ముందుగా ఉత్తరాంధ్రలోనే ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, మాజీ కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మార్పు కోసం...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

## సంపాదకీయం

# మెరుపు వచనకారుడు


ఒక కవిని ఎలా పరిచయం చేయాలి? ఒక కథ మీద ఎలా కామెంట్ చేయాలి? ఒక సినిమాని ఎలా సమీక్షించాలి? సాహిత్యంలోనో, సంగీతంలోనో, వ్యాపారం లోనో ప్రసిద్ధుడయిన ఒకరి గురించి చెప్పడం ఎలా? ఇందులో విశేషం ఏమీ లేదు. ఏళ్ల తరబడి సమీక్షలు, వ్యాఖ్యానాలు, వ్యాసాలూ చూస్తూనే వున్నాం. అవి ఎక్కువగా ఒక మూసలో వుంటాయి. పాత సంప్రదాయాన్ని పట్టుకు వేలాడుతుంటాయి. కొన్ని అకడెమిక్‌గా, కొన్ని పడికట్టు పదాలతో, మరికొన్ని మొక్కుబడిగా వుంటాయి. ఆ ని విజయవంతంగా బ్రేక్ చేసినవాడు తాడి ప్రకాష్. జర్నలిస్టుగా అనుభవం, సాహిత్యాభిలాష, ఆధునికమైన చూపు %-% సంప్రదాయాన్ని బద్దలు చేయగల శక్తిని ప్రకాష్‌కి యిచ్చాయి. తెలుగులో బాగా రాయగలిగేవాళ్లు చాలామంది వున్నారు. సమర్థవంతంగా రాయగలిగేవాళ్లూ అనేకమంది వున్నారు. కానీ తాడి ప్రకాష్‌లా ఒక బ్రేక్ త్రూ సాధించినవాళ్లు అతికొద్దిమంది. ప్రకాష్ వాక్యాలు చాలా తేలిగ్గా రాసినట్టు పైకి కనిపించినా, ఆ నిర్మాణం సౌమ్యంగా, హుందాగా సాగుతూనే, చటుక్కున దూకుడుగా ఒక మాట అనడం వెనక ఒక కచ్చితమైన వ్యూహం వుంటుంది. పాజిటివ్‌గా రాసినా, నెగెటివ్‌గా రాసినా, కొన్నిచోట్ల కొంత 'అతి'గా అనిపించినా, ఆయన నిజాయితీ అక్షరాల్లో మెరుస్తూనే వుంటుంది. "పొగడ పూల పరిమళమే వగరు జ్ఞాపకాల నవ్వు" అంటూ విమల కవిత్వం గురించిన ప్రకాష్ సమీక్ష విలువైనది. శ్రీశ్రీ అంతిమయాత్రపై ప్రకాష్ ఆర్టికల్ ఎప్పటికీ మరిచిపోలేం. ఐస్ బ్లాక్ మీద అచేతనంగా వున్న మహాకవి గురించి రాస్తూ, "హిమాలయాన్ని తలకింద దిండుగా పెట్టుకుని నిద్రపోతున్న అగ్నిపర్వతంలా వున్నాడు శ్రీశ్రీ" అన్నాడు ప్రకాష్. మహాకవి అంతిమ వీడ్కోలు ఆర్టికల్‌కి ప్రకాష్ పెట్టిన హెడ్డింగ్: 'శ్రీశ్రీకి అశ్రుదీపాల అల్విదా'. 'మాండలికంలో మొగలాయి' నామిని అన్నా, 'సట్లెజ్ కెరటాలు పిలిచాయా బంగోరే!' అన్నా, 'ఒక బెల్జియం అద్దం' రాంభట్ల కృష్ణమూర్తి అన్నా అది ప్రకాష్ మార్క్ రచన. కమ్యూనిస్టు భావజాలం వున్నవాడే అయినా, "కమ్యూనిస్టు పార్టీలకు భవనాలు మాత్రమే మిగిలి, జనాలు దూరం అవుతున్న కాలం ఇది" అని రాస్తాడు. నండూరి రామ్మోహన్ రావు, ఎ.బి.కె. ప్రసాద్, కె.ఎన్.వై పతంజలి లాంటి గొప్పవాళ్లతో కలిసి పనిచేసిన అనుభవాలు రాసినా, తనని తాను ప్రొజెక్ట్ చేసుకోడు. గోరటి వెంకన్న గురించి రాస్తూ, "హృదయాన్ని పాటతో నింపేవాడి గ్లాసు మాత్రం నింపగల నిమిత్తమాత్రుణ్ణి నేను" అంటాడు. ప్రొఫెసర్ సాయిబాబా గురించి రాస్తూ, "చదువూసంధ్యా లేని చవట సన్నాసులు రాజ్యమేలుతున్నపుడు, జ్ఞానకాంతులీనే ఒక యూనివర్సిటీ ప్రొఫెసర్ జైల్లో వుండటమే న్యాయం కదా" అంటాడు. జర్నలిజం, కవిత్వం, సాహిత్యం, సంగీతం, సినిమా, రాజకీయాలు, చరిత్ర.. దేని గురించి అయినా హృదయాన్ని హత్తుకునేలా చివరి వాక్యం దాకా చదివించేలా రాయగలగడం సామాన్య విషయం కాదు. సున్నితమైన, కవితాత్మకమైన ప్రకాష్ వచనం చదువుకోవడం ఒక మంచి అనుభవం. అందులోని వ్యంగ్యమూ, ఎకసెక్కమూ గిలిగింతలు పెడతాయి. 'ఉదాత్తమైన అక్రమ ప్రేమ' అనే శీర్షికతో జాతీయ, అంతర్జాతీయ సినిమాల గురించి ఒక సిరీస్ రాశాడు. భూమిక, పరోమా, ఆస్తా, సమ్మర్ ఆఫ్ 42, శోభ%-% బాలూ మహేంద్ర ఎఫైర్ గురించిన వ్యాసాలు చదివి తీరవలసినవి. పెళ్లయిన స్త్రీ మరొకతనితో ప్రేమలో పడడం అనేది వీటి థీమ్. ఇందులో భాగంగానే నటి ఇంగ్రిడ్ బెర్గ్‌మన్ భర్త, గ్రేట్ ఇటాలియన్ డైరెక్టర్ రోబర్టో రోసాలిని, బెంగాలీ బ్యూటీ సోనాలి ప్రేమకథ తెలుగులో మొదటిసారి రాసింది ప్రకాష్ మాత్రమే. అలాగే, చేగువేరాని పాతిపెట్టిన ప్రాంతాన్ని 30ఏళ్ల తర్వాత డిస్కవర్ చేసిన ప్రఖ్యాత అమెరికన్ జర్నలిస్టు జాన్ లీ ఆండర్సన్ గురించి మొదటిసారి మనకి తెలియజేసిన వాడూ ఈ ఉత్తమ జర్నలిస్టే. తెలుగు సాహిత్యంలో కె.ఎన్.వై పతంజలి ప్రాధాన్యం గురించీ, తెలుగు కళకి ఆర్టిస్ట్ మోహన్ కాంట్రిబ్యూషన్ గురించీ, తెలుగు సాహిత్య విమర్శని పదునుపెట్టిన రాచమల్లు రామచంద్రారెడ్డి కృషి గురించీ ప్రకాష్ వ్యాసాలు మళ్లీమళ్లీ చదువుకునేలా వుంటాయి. సాలోమోన్ విజయ్ కుమార్ 'మునికాంత పల్లె కథలు' చదివి, "ఏం రాశావ్ రా నా కొడకా" అని ప్రకాష్ దురుసుగా అనడం సంప్రదాయ పద్ధతిని బద్దలుకొట్టడానికే. 'నల్ల వంతెన' కథలు రాసిన నాగేంద్ర కాశీని, 'మైరావణ' రాసిన యువ రచయిత ప్రసాద్ సూరినీ భుజంతట్టి ప్రోత్సహించడం ప్రకాష్ ఎంతో బాధ్యతతో చేసిన పని. 'సాహిత్యంలో స్త్రీ సాహసం' అంటూ ఇప్పటి రచయిత్రుల గురించిన వ్యాసం %-% ప్రకాష్ ఇప్పటికీ విస్తృతంగా చదువుతున్నాడనడానికి ఒక నిదర్శనం. 'అనుభూతి గీతమై విరబూసిన వెన్నెల' అంటూ ఖదీర్ బాబు జ్ఞాపకాలకు ప్రకాష్ రాసిన ముందు మాట దాదాపు కవిత్వమే. చేరా, మద్దుకూరి చంద్రం, వేగుంట మోహన్ ప్రసాద్ గురించి రాసినా, అరుణ్ సాగర్, కలేకూరి ప్రసాద్, పైడి తెరేష్ బాబు గురించి రాసినా ఆప్యాయత నిండిన ఆ అక్షరాల్లో ఒక ప్రత్యేక ఆకర్షణ వుంటుంది. విశ్వనాథ, పెద్దిభొట్ల, బంగోరె, కేశవరెడ్డి, గుడిహాళం రఘునాథం లాంటి మహానుభావుల గురించి ప్రకాష్ గాఢమైన అనుభూతితో, ఒక ఉద్వేగంతో రాసే మాటలు కంటతడి పెట్టిస్తాయి. జర్నలిస్టుగా ప్రకాష్ 40 ఏళ్ల అనుభవాలూ, జ్ఞాపకాలతో మూడేళ్ల క్రితం వచ్చిన 'ఏలూరురోడ్ ఆత్మగీతం' పుస్తకం జనాదరణ పొందింది. ప్రకాష్ వ్యాసాలతో రెండో పుస్తకం 'ఖైరతాబాద్ చౌరస్తా' త్వరలోనే రాబోతోంది.

# నిజంగా హర్షణీయం!



కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని సమూలంగా మార్చేసింది. దాని పర్యవసానాల్లో ఒకటి, బయటికి వెళ్లే పనిలేకుండా చేయగలిగే పనుల గురించి ఆలోచించడం. అలాంటి ఒక కారణంతో మొదలైన 'హర్షణీయం' తెలుగు పాడ్‌కాస్ట్, సమస్త సాహిత్య ప్రపంచాన్ని తెలుగు గడపలోకి తెచ్చిపెట్టింది. అంతేనా? అనువాద ప్రపంచంలోకి అడుగుపెట్టాలనుకునే ఏ భాషవారికైనా ఒక ఆన్ లైన్ నిధిగా రూపొందింది. 2020 మార్చ్‌లో ముందు తెలుగులో ప్రారంభమై, తర్వాత తెలుగు%-% ఆంగ్లంగా మారి, అటుపై ఆంగ్లంలోకి కూడా వ్యాపించిన ఈ పాడ్‌కాస్ట్ 'నూరు మంది అనువాదకుల' సిరీస్‌ను ఇటీవలే ముగించుకుంది. ఇందులో మలయాళం, తమిళం, కన్నడం, గుజరాతీ లాంటి భారతీయ భాషల్లోంచి ఆంగ్లంలోకి అనువదిస్తున్నవారితో పాటు%-% థాయి, ఉజ్బెక్, వియత్నమీస్, హంగేరియన్, తుర్కిష్, నార్వేజియన్, మంగోలియన్, కిస్వాహిలీ లాంటి భాషల ఆంగ్లానువాదకుల ఇంటర్వ్యూలు ఉన్నాయి. దోస్తోవ్‌స్కీ ఉపరితల అంశాల మీద సమయం వృథా చేయరని చెబుతారు, గతేడాదే 'బ్రదర్స్ కరమజోవ్'కు మరో ఆంగ్లానువాదం వెలువరించిన మైకేల్ ఆర్. కట్జ్. మనిషిని మలిచే కీలక క్షణాలు, విశ్వాసం, నైతికత, హింస, తీవ్రోద్వేగాల మీద దోస్తోవ్‌స్కీ దృష్టి ఉంటుందని అంటారు. పంతొమ్మిదో శతాబ్దపు రష్యన్ సాహిత్యాన్ని బోధించే మైకేల్ సుమారు 20 రష్యా నవలల్ని అనువదించారు. దోస్తోవ్‌స్కీ 'నోట్స్ ఫ్రమ్ అండర్‌గ్రౌండ్'లోని తొలి 30 పేజీలు అనువాదానికి అసలు లొంగనివని ఆయన అభిప్రాయం. ఒక పుస్తకం పుట్టించే తక్షణ స్పందనే దాన్ని అనువాదానికి పూనుకునేలా చేస్తుందని చెబుతారు అరుణవ సిన్హా. పదహారేళ్ల కాలంలో సుమారు 80 పుస్తకాల్ని బంగ్లా నుంచి ఆయన ఆంగ్లంలోకి అనువదించారు. సగటున ఏడాదికి ఐదు పుస్తకాలు! ఒక దానిలో దిగితే అందులో మునిగిపోవడమే ఇంత వేగంగా అనువదించడానికి కారణమంటారు. ఫుట్‌నోట్ ఇవ్వాల్సి రావడాన్ని ఒక వైఫల్యంగా చూస్తారు హిందీ, ఉర్దూ నుంచి అనువాదాలు చేసే అమెరికన్ డైసీ రాక్‌వెల్. భాషల మీద ప్రేమతో ఆమె దాదాపు పదిహేను భాషలు నేర్చుకున్నారు. ఇంకా, కరీమ్ అబ్దుల్ రహమాన్ (కుర్దిష్), జెస్సికా కోహెన్ (హీబ్రూ), లోలా రోజర్స్ (ఫిన్నిష్) లాంటివాళ్లు ఈ పాడ్‌కాస్ట్‌లో తమ ఆలోచనలను పంచుకున్నారు. అనువాద క్రాఫ్ట్‌తో పాటు మొత్తంగా అనువాద ఎకో సిస్టమ్ గురించి ఇంత విస్తారంగా ఒకేచోట మాట్లాడిన పాడ్‌కాస్ట్ ప్రపంచంలో ఇంకోటి లేదని ఐస్‌లాండిక్ అనువాదకురాలు విక్టోరియా క్రిబ్ కితాబునివ్వడం హర్షణీయం అందుకున్న ప్రశంసల్లో ఒకానొకటి. మూడు దశాబ్దాలుగా స్నేహితులైన ఇంజినీరింగ్ క్లాస్‌మేట్లు హర్ష, అనిల్, గిరి ఉద్యోగాలు చేస్తూనే, పాఠకులుగా తమ అభిరుచితో 'హర్షణీయం' మొదలుపెట్టారు. ఇందులో హర్ష కథకుడు, అనిల్ అనువాదకుడు, గిరి సాంకేతిక నిపుణుడు. వక్తలను ఎంచుకోవడం, ప్రశ్నలు కూర్చుకోవడం ముగ్గురూ కలిసి చేస్తారు. ఎడిటింగ్ బాధ్యత కుదిరినవాళ్లు తీసుకుంటారు. ఇంటర్వ్యూలు మాత్రం అనిల్ చేస్తారు. సాహితీవేత్తలను ఇంటర్వ్యూలు చేయడంలో ప్రొఫెసర్ మృణాళిని 'అక్షర యాత్ర' తమకు స్ఫూర్తి అంటారు. ముందు తెలుగు రచయితల సంభాషణలతో మొదలుపెట్టి, తర్వాత ఇరవై నాలుగు రాష్ట్రాల్లోని పర్యావరణవేత్తల అభిప్రాయాలకు వేదికై, బిభూతీభూషణ్ బంధోపాధ్యాయ 'వనవాసి' నవలను యాభై వారాలు ఆడియోగా ఇచ్చి, తర్వాత అనువాదకుల వైపు మళ్లారు. లోప్రొఫైల్‌లో ఉండే అనువాదకుల మెయిల్స్, కాంటాక్ట్ నంబర్స్ సంపాదించడం, వాళ్లకు తమ వివరాలు చెబుతూ సందేశాలు పంపడం, ఒక్కోసారి ఎనిమిది నెలల తర్వాత కుదురుతుందని చెబితే వేచివుండి(ఉదా: మైకేల్ కట్జ్) మళ్లీ సంప్రదించడం, ప్రశ్నలు ముందే పంపడం, విదేశీయుల సమయాన్ని బట్టి రాత్రుళ్లు మాట్లాడటం, వివాదాల జోలికి పోకుండా పుస్తకాల మీదే ఫోకస్ పెట్టడం వీళ్ల పనితీరు. ఎక్కువ అనువాదాలు జరిగే ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్ అనువాదకులు కూడా సహజంగానే ఈ పాడ్‌కాస్ట్‌లో చోటుచేసుకున్నారు. 'ది హర్షణీయం పాడ్‌కాస్ట్ అండ్ ఇట్స్ ఇటాలియన్ లిటరేచర్ ఇన్ ట్రాన్స్‌లేషన్' పేరుతో 'ద గ్లోబల్ లిటరేచర్ ఇన్ లైబ్రరీస్ ఇనీషియేటివ్' 2024 నవంబర్‌లో వీళ్ల పాడ్‌కాస్ట్‌ను ప్రస్తావించడం విశేషం. కొన్నింటికి కాలం కూడా కలిసిరావాలి. ఇంకో కాలంలో అయితే ఇలాంటిది జరిగే అవకాశం లేదు. కొన్ని మెయిల్స్‌తో, ఒక్క ఫోన్‌కాల్‌తో ప్రపంచంలో ఎక్కడో ఉన్నవారితో సంభాషించడం ఎలా సాధ్యం? కాని కలిసొచ్చే కాలంలో కూడా ఎంతమంది ఇలాంటి పనికి పూనుకున్నారు? అందుకే వీళ్ల పని హర్షణీయం. తెలుగు భాషలోని 56 అక్షరాలన్నీ దేశాల వారితోనైనా మాట్లాడాలని సరదాగా వీళ్లు పెట్టుకున్న లక్ష్యం నెరవేరింది. అనువాదకుల సిరీస్‌లో భాగంగా, గతేడాది ప్రతిష్ఠాత్మక బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్ లాంగ్‌లిస్ట్‌లోని పదముగ్గురు అనువాదకులతోనూ సంభాషించారు. ఈ ఏడాది లాంగ్‌లిస్ట్‌లోని రిఫరెన్సుల్ని సాక్షాత్తూ 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్' అడ్మినిస్ట్రేటర్ ఫియమెత్తా రోకో ఇచ్చి ఇంటర్వ్యూలకు సహకరించడం వీళ్ల విశ్వసనీయతకు చిహ్నం. ఈ సంభాషణలు ఈ ఏప్రిల్‌లోనే ప్రసారం అవుతాయి. అక్కడివాళ్లను ఇక్కడికి తెస్తున్నారు సరే, తెలుగువాళ్లు అటుపోయే మార్గమేమిటి? 'తెలుగులో గొప్ప రచయితలు చాలామంది ఉన్నారు. కానీ ముందు ఆంగ్లంలోకి అనువాదం కావడంబీ ముఖ్యంగా యూకే, యూఎస్‌లో ప్రచురితం కావడం అతిపెద్ద సవాలు. దానికి నాణ్యమైన అనువాదకులతో పాటు నిబద్ధత ఉన్న ప్రచురణకర్తలు అవసరం' అని చెబుతారు అనిల్. తెలుగు సాహిత్యంలో ఆ వాతావరణం క్రమంగా చోటుచేసుకుంటోందనీ, రెండేళ్లలో సానుకూల మార్పు చూడబోతున్నామనీ అంటారు. ఇది ఇంకోరకంగా హర్షణీయం.

# ఎర్రబుక్కు తెల్లమొహం!



ఎర్ర పుస్తకం తెల్లమొహం వేసినట్లయింది. రాజ్యాంగ విధి విధానాలను కూడా ప్రైవేటీకరించబోయిన తెంపరితనానికి చెంపలు వాయించినట్లయింది. ఇష్టారీతిన పోలీసు రాజ్యాన్ని నడుపుతామంటే, పౌరహక్కుల్ని చిదిమేస్తామంటే అంగీకరించేది లేదని ఇప్పటికే పలుమార్లు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయ స్థానం ప్రభుత్వ యంత్రాంగాన్ని హెచ్చరించింది. ఇప్పుడదే హెచ్చరికను జనతా న్యాయస్థానం కూడా జారీ చేసినట్లయింది. రాష్ట్రంలో 56 మండల పరిషత్తు అధ్యక్ష ఉపాధ్యక్ష స్థానాలకు, కడప జిల్లా పరిషత్తు అధ్యక్ష స్థానానికి మొన్న ఉపఎన్నికలు జరిగాయి. ఓట్లు వేసింది ఎంపీటీసీలు, జడ్పీటీసీలే. వీరు క్షేత్రస్థాయి ప్రజా ప్రతినిధులు. జనం గుండె చప్పుళ్లను నిరంతరం వినగలిగేవాళ్లు. ప్రజల నాడీ స్పందనను ముందుగా పసిగట్టగలిగేవాళ్లు. ఉపఎన్నికల్లో అధికార కూటమి పన్నిన వ్యూహం ఫలించ లేదు. విపక్షమైన వైసీపీ ఘనవిజయాన్ని నమోదు చేసింది. కడప జడ్పీతో సహా 40 స్థానాలను ఆ పార్టీ అవలీలగా గెలవగలిగింది. కూటమికి 10 స్థానాలు దక్కాయి. మిగిలినచోట్ల ఎన్నిక వాయిదా పడింది. వైసీపీ టిక్కెట్‌పై గెలుపొందిన స్థానిక ప్రతినిధులు ఆ పార్టీ పక్షాన్నే నిలవడంలో వింతేముందని ఇప్పుడు కూటమి చిలుకలు పలుకుతుండవచ్చు. కానీ ఏపీలో ఈ తొమ్మిది నెలల పూర్వరంగం అర్థమైన వారికి వైసీపీ గెలుపులో వింతే కాదు, అద్భుతం కూడా కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజానీకంలో బలంగా వేళ్లూనుకున్న పార్టీ వైసీపీ. ఆ సంగతి కూటమి నేతలకు స్పష్టంగా తెలుసు. అందుకే కూటమి కట్టుకున్నారు. కుయుక్తులను ఆశ్రయించారు. ఎన్నికల్లో ఈ కూటమి చేసిన దుష్ప్రచారం, వెదజల్లిన విషం, పలికిన అసత్యాలు, చేసిన బూటకపు బాసలు అనే నిచ్చెనమెట్ల మీదుగా చేరుకున్న అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రతిపక్ష పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేయాలనే సంకల్పానికి అధికార కూటమి వచ్చినట్టు దాని చర్యలు నిరూపిస్తున్నాయి. ఇటువంటి ప్రయ త్నాలు సత్ఫలితాలనివ్వవని గతంలో అనేక గుణపాఠాలు న్నాయి. అయినా అధికార మత్తులో ఉన్నప్పుడు అవి స్ఫురించక పోవచ్చు. 'తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు.... ... కానీ మూరు?ని మనసును సమాధానపరచడం మాత్రం సాధ్యంకాద'ని భర్తృహరి చెప్పిన సుభాషితం మనకు ఉండనే ఉన్నది. ప్రభుత్వ వైఖరిని విమర్శించిన వారి మీద, ఎన్నికల హామీలను అమలు చేయలేదేమని అడిగిన వారి మీద వందలాది కేసులు నమోదయ్యాయి. టెర్రరిస్టుల మీద పెట్టాల్సిన కేసులను సోషల్ మీడియా విమర్శకుల మీద ఎందుకు పెడు తున్నారని హైకోర్టు ప్రశ్నిస్తున్నా పోలీసు యంత్రాంగం ఖాతరు చేయడం లేదు. రక్షక భటులే అర్ధరాత్రి పూట సివిల్ డ్రెస్సుల్లో ఇళ్లలోకి చొరబడి విమర్శకులను బరబరా లాక్కొని వెళ్తున్నారని, రాష్ట్రమంతటా తిప్పుతున్నారనీ, కుటుంబ సభ్యులకు సమా చారం కూడా ఇవ్వడం లేదనే ఆరోపణలు తరచుగా వినిపి స్తున్నాయి. పోసాని కృష్ణమురళి పదేళ్ల కింద ప్రెస్‌మీట్‌లో చేసిన విమర్శలపై టెర్రరిస్టు కేసు పెట్టి జైల్లోకి నెట్టారు. నడివీధుల్లో విపక్ష కార్యకర్తలను విచ్చుకత్తులతో నరుకుతున్న దృశ్యాల వీడియోలను చూడవలసి వచ్చింది. ప్రైవేట్ ఆస్తుల మీద దాడులు జరిగాయి. పార్టీ ఆఫీసులను కూల్చేశారు. పంట చేల విధ్వంసం జరిగింది. పండిన తోటలను నరికేశారు. మీడియా మీద అప్రకటిత సెన్సార్‌షిప్ అమలైంది. తమకు గిట్టని వార్తా చానెళ్ల ప్రసారాలను నిలిపివేసేలా కేబుల్ ఆపరేటర్ల మీద ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో వచ్చిన స్థానిక ఉపఎన్నికల సందర్భంగా కూటమి నాయకత్వం మరింత రెచ్చిపోయింది. స్థానిక ప్రతి నిధులను లొంగదీసుకోవడానికి సామ దాన భేద దండో పాయాలను ప్రయోగించారు. ప్రలోభాల ఎరలు వేశారు. కేసులు పెడతామని బెదిరించారు. ఉపాధిని దెబ్బతీస్తామని హెచ్చరించారు. పోలీసు యంత్రాంగాన్ని చేతిలో పెట్టుకొని స్వయంగా ప్రభుత్వమే అధికార జులుమ్‌కు దిగినప్పుడు స్థానిక ప్రతినిధులను లొంగదీసుకోవడం పెద్ద విశేషమేమీ కాదు. పైగా రాజ్యసభల్లో, శాసన మండళ్లలో అధికార హోదాలు వెలగబెట్టిన బడాబడా ఆసాములే సర్కార్ కొరడా ముందు సాగిలపడి పోయిన ఉదంతాలు కళ్లముందటే కనిపిస్తున్నాయి. స్థానిక పదవులను గెలుచుకోవడానికి అధికార పార్టీ బరి తెగించిందనీ, పలుచోట్ల ప్రతినిధులను అడ్డుకున్నారనీ, ప్రలోభపెట్టారనీ 'సాక్షి' మీడియానే కాదు, 'ప్రజాశక్తి' పత్రిక కూడా రాసింది. ఇలా అధికార యంత్రాంగం బరితెగించి ప్రవర్తించినప్పుడు స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ స్వీప్ చేయడం కష్టం కాదనే అభిప్రాయం చాలామందికి ఉంటుంది. కానీ, వైసీపీ స్థానిక ప్రతినిధులు అరుదైన ప్రజాస్వామిక చైతన్యాన్ని ప్రదర్శించారు. పరిశీలకులను ఆశ్చర్యంలో ముంచెత్తారు. నిర్బంధాలను ధిక్క రించి తమను నమ్మి గెలిపించిన పార్టీ పక్షానే దృఢంగా నిలబడ్డారు. తమ పదవులేమీ ప్రభావం చూపగలిగేంత పెద్దవి కాదు. అయినా సరే విశ్వసనీయతకే వారు పట్టం కట్టారు. గోడ దూకిన బడా ఆసాములు ఈ పరిణామం తర్వాత ఎలా తలెత్తుకుంటారో చూడాలి. 'స్టేట్ టెర్రరిజమ్' అనదగ్గ స్థాయిలో నిర్బంధకాండను ప్రయోగించినా ఈ క్షేత్రస్థాయి ప్రతినిధులు దృఢంగా నిలవడానికి రెండు ముఖ్యమైన కారణాలు కనిపి స్తున్నాయి. మొదటిది %-% రెండు నెలల క్రితం పార్టీ కార్య కర్తలనుద్దేశించి ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగం. కార్యకర్తలెవరూ అధైర్యపడవలసిన అవసరం లేదనీ, వారికి తాను అండగా నిలబడతాననీ ప్రకటించారు. జగనన్న 2.0 కార్యకర్తల కోసం ఎలా పనిచేస్తాడో చేసి చూపెడతానని భరోసా ఇచ్చారు. జగన్ ప్రకటన తర్వాత గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకర్తలకు మంచి ప్రేరణ లభించిందనీ, వారు ధైర్యంగా నిలబడుతున్నారనీ వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇక రెండో ప్రధాన కారణం క్షేత్రస్థాయి వాస్తవికత. ఎన్నికలకు ముందు చంద్రబాబు కూటమి చేసిన బూటకపు హామీల బండారం ప్రజ లందరికీ అర్థమైంది. వైసీపీ సర్కార్ మీదా, జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిగతంగా కూటమి చేసిన ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలేనని ప్రజాశ్రేణులు ఇప్పుడు భావిస్తున్నాయి. మోసపోయామన్న భావన వారిని వెంటాడుతున్నది. ప్రభుత్వంపై వ్యతిరేకత క్రమంగా పెరుగుతున్నది. వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి భయపడటం లేదు. బహిరంగంగానే కూటమి సర్కార్‌ను విమర్శిస్తున్నారు. ఈ పరిణామం కూడా వైసీపీ కార్యకర్తలు ఎదురొడ్డి నిలబడేందుకు దోహదపడింది. జనంలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నా కూటమి సర్కార్ తన ధోరణిని మార్చుకోకపోగా అదే అసత్య ప్రచారాన్ని మరింత ఎక్కువగా ఆశ్రయిస్తున్నది. తేలిపోయిన ఆరోపణల్నే మళ్లీ మళ్లీ ఎక్కుపెడుతున్నారు. చంద్రబాబు చెబుతున్న అప్పుల లెక్కల్ని గుర్తు చేసుకుంటూ జనం నవ్వుకుంటున్నారు. సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి. శనివారం నాడు జరిగిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కూడా అలవాటు ప్రకారం అప్పుల కథను మరోసారి వినిపించారు. ఎన్నికల ప్రచారంలో 14 లక్షల కోట్లున్న అప్పు, గవర్నర్ ప్రసంగంలో 10 లక్షల కోట్లుగా మారి, బడ్జెట్ ప్రసంగంలో ఏడు లక్షల కోట్లుగా రూపాంతరం చెంది, ఆవిర్భావ సభలో తొమ్మిదిన్నర లక్షల కోట్లుగా పరిణామం చెందింది. అప్పుల కథతోపాటు అసలు విషయాన్ని కూడా ఆయన కుండబద్దలు కొట్టి చెప్పారు. "బయట నుండి (ప్రభుత్వంలోకి రాకముందు) చూసినప్పుడు 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయవచ్చని అనుకున్నా, ఇప్పుడు చూస్తే తొమ్మిదిన్నర లక్షల కోట్ల అప్పుంది. దీనిపై వడ్డీ కట్టాలి. ఇప్పుడు సంక్షేమాన్ని అమలుచేస్తే మధ్యలోనే ఆగిపోతుంది. కనుక ముందుగా అభివృద్ధి చేసి, వచ్చే ఆదాయంతో సంక్షేమం చేద్దా"మని ఈ సభలో చెప్పుకొచ్చారు. ఈ తూచ్ మంత్రాన్ని ఆయన ఆవిర్భావ సభలో మాత్రమే చెప్పలేదు. ఈ వార్షిక బడ్జెట్‌లో కూడా ఆయన దీన్ని పొందు పరిచారు. కాకపోతే అంకెల్లో చెప్పడం వల్ల సరిగ్గా అర్థం కాలేదు. 'సూపర్ సిక్స్'గా పేర్కొన్న ఆరు అంశాలను ఆయన చెప్పి నట్టుగా అమలు చేస్తే 70 వేల కోట్ల పైచిలుకు నిధులు అవసరమవుతాయని అంచనా. అయితే బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం 17 వేల కోట్లు మాత్రమే చూపెట్టారు. కేటాయింపు చూపినంత మాత్రాన అమలు చేస్తారని అర్థం కాదు. గత బడ్జెట్‌లో కూడా 'తల్లికి వందనం', 'అన్నదాతా సుఖీభవ' పథకాలకు అరకొర కేటాయింపులు చూపెట్టారు. కానీ,అందులో అణా పైసలు కూడా ఖర్చుపెట్టలేదన్నది జనం అనుభవంలోకి వచ్చిన సత్యం. మొన్నటి మంగళవారం జోలెతో పాడుకున్న వేలంతో కలిపి తొమ్మిదిన్నర మాసాల్లో బాబు సర్కార్ ఒక లక్షా 52 వేల కోట్ల పైచిలుకు అప్పులు చేసి జాతీయ రికార్డును నెలకొల్పింది. ప్రభుత్వం నేరుగా చేసిన అప్పు 98,088 కోట్లయితే, ష్యూరిటీ సంతకం పెట్టి కార్పొరేషన్ల ద్వారా చేసిన అప్పు 23,700 కోట్లు, ఇక రాజధాని పేరుతో ఇప్పటివరకు చేసిన అప్పు 31,000 కోట్లు. వెరసి 1,52,788 కోట్లు. ఇంతటి జగదేక అప్పారావు ప్రభుత్వం జగన్ సర్కార్‌ను అప్పులకు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రచారం చేయబూనడాన్ని దాష్టీకం అనాలో, దగుల్బాజీతనం అనాలో తెలుసుకోవాలి. ఈ అప్పుల చిట్టా వ్యవహారం ఇక ఎంతమాత్రమూ దాచేస్తే దాగేది కాదు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇస్తున్న సమాచారాన్ని బట్టి, కాగ్ రిపోర్టుల ఆధారంగా, బడ్జెట్ పత్రాల సాక్షిగా జనంలోకి వాస్తవాలు వస్తున్నాయి. రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం అప్పుల కుప్ప చేసిందన్న ప్రచారాన్ని ఇప్పుడెవ్వరూ నమ్మడం లేదు. జగన్ ప్రభుత్వ హయాంలో విధ్వంసం జరిగిందనే మాట చంద్రబాబుకు ఊతపదంగా మారింది. చివరికి కలెక్టర్ల సమా వేశంలో కూడా 'గత ప్రభుత్వం విధ్వంసం చేసింద'ని మాట్లా డారు. ఇలా కలెక్టర్ల సమావేశాన్ని రాజకీయాలకు వాడుకున్న ముఖ్యమంత్రి ఈయన తప్ప మరొకరు ఉండకపోవచ్చు. తాను చెప్పిందే వేదం, తన పచ్చ కోడి కూస్తేనే సమాచారం తెలిసేది అనే భ్రమల్లోంచి ఆయనింకా బయటపడలేదు. పదేపదే అబద్ధాన్ని వల్లెవేస్తే అది నిజమైపోతుందనే పాతకాలపు గోబెల్స్ థియరీని పట్టుకొని వేళ్లాడుతున్నారు.

# పెను ఉత్పాతం

భూమిని గురించి చెబుతూ ప్రఖ్యాత కవి దేవిప్రియ అది 'మధ్యమధ్యలో మతిభ్రమించే/ మమతానురాగాల మాతృమూర్తి' అంటారు. సకల సంపదలకూ పుట్టిల్లయిన నేలతల్లి ఎందుకనో ఆగ్రహించింది. శుక్రవారం మధ్యాహ్నం రిక్టర్ స్కేల్‌పై 7.7 తీవ్రతతో సంభవించిన భూకంపాల పరంపర మయన్మార్, థాయ్‌లాండ్‌లను తీవ్రంగా దెబ్బతీయగా... మయన్మార్ ఇరుగు పొరుగు నున్న భారత్, చైనాలను భూప్రకంపనలు వణికించాయి. ఈశాన్య భారత్, బెంగాల్, ఢిల్లీ తదితర చోట్ల ప్రకంపనలు కనబడగా, చైనాలో యునాన్, సిచువాన్ ప్రాంతాలు దీని బారినపడ్డాయి. ఈ భూప్రళయం ఒక్కసారిగా జనజీవనాన్ని తలకిందులు చేసింది. మృతులెందరన్న లెక్క వెంటనే తేలడం కష్టం. ఎందుకంటే కోటి 70 లక్షల జనాభాగల థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఆకాశా న్నంటే భవనాలు చాలా వున్నాయి. వాటిల్లో అనేకం నేలమట్టమయ్యాయి. వేలాదిమంది ఇరుక్కు పోయారు. వర్తక, వాణిజ్య, ఉత్పాదక కార్యకలాపాలు ముమ్మరంగా సాగే వేళ భూకంపం రావటం ప్రాణనష్టాన్ని పెంచివుండొచ్చన్న అంచనాలున్నాయి. మయన్మార్‌లో సైనిక పాలనవల్ల పరిస్థితి తీవ్రత తెలియటం లేదంటున్నారు. అయితే భూకంప కేంద్రం ఆ దేశంలోని రెండో పెద్ద నగరమైన మాండలేకు సమీపంలో వుండటం, భూగర్భంలో 20%-% 30 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభ వించటాన్నిబట్టి నష్టం ఎక్కువుంటుందన్నది భూభౌతిక శాస్త్రవేత్తల అంచనా. నిరంతర ఘర్షణలతో అట్టుడుకుతున్న ఆ దేశంలో ఇప్పటికే 30 లక్షలమంది కొంపా గోడూ వదిలి అత్యంత దుర్భరమైన స్థితిలో బతుకీడుస్తున్నారు. ఒక్కో పట్టణం ఒక్కో సాయుధ ముఠా గుప్పిట్లో వుంది. ఇవిగాక సైన్యం అడపా దడపా వైమానిక దాడులు చేస్తోంది. ఈ భూకంపం ఆ దేశ జనాభాలో మూడోవంతుమందిని తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం వున్నదని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటించింది. మిగిలిన వైపరీత్యాలు విరుచుకుపడే ముందు ఏదో రకమైన సూచనలందిస్తాయి. జాగ్రత్త పడటానికి కాస్తయినా వ్యవధినిస్తాయి. కానీ భూకంపాలు చెప్పా పెట్టకుండా విరుచుకుపడతాయి. రెప్పపాటులో సర్వం శిథిలాల కుప్పగా మారుతుంది. అపార ప్రాణనష్టం వుంటుంది. తప్పించు కున్నవారిని సైతం తీవ్ర భయోత్పాతం వెన్నాడుతుంది. భూమి లోలోతు పొరల్లో అనునిత్యం మార్పులు సంభవిస్తూనే వుంటాయి. భూభౌతిక శాస్త్రవేత్తలు చెబుతున్నదాన్నిబట్టి భూగర్భం ఏడు పలకలుగా విడివడి వుంటుంది. వీటిల్లో వచ్చే కదలికలూ, అవి తీసుకొచ్చే రాపిడులూ పర్యవసానంగా ఆకస్మికంగా శక్తి విడుదలవుతుంటుంది. ఆ శక్తి తరంగాల రూపంలో భూ ఉపరితలానికి చేరుతుంది. అది భూకంపం రూపంలో వ్యక్తమవుతుంది. భూకంపం మనిషి జ్ఞానాన్ని పరిహసించే ప్రకృతి విపత్తు. ఖగోళంలో మానవుడు సాధించిన ప్రగతి అంతా ఇంతా కాదు. అక్కడ జరిగే పరిశోధనలు అన్నీ ఇన్నీ కాదు. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా 2018లో ప్రయోగించిన పార్కర్ సోలార్ ప్రోబ్ నిరుడు డిసెంబర్ 24న సూర్యుడి ఉపరితలానికి 60 లక్షల కిలోమీటర్ల దూరంలో పరిభ్రమించింది. ఇది అత్యంత సమీపం వరకూ వెళ్లినట్టు లెక్క. కానీ కాళ్లకింద పరుచుకున్న భూమి లోలోతు పొరల్లో ఏం జరుగుతున్నదో ఆరా తీయటంలో వైఫల్యాలే ఎదురవుతున్నాయి. భూకంపాలపై సాగుతున్న పరిశోధనలు గతంతో పోలిస్తే ఎంతో కొంత ప్రగతి సాధించాయనే చెప్పాలి. ఫలానాచోట భూకంపం రావొచ్చని చెప్ప గలిగే స్థాయి వచ్చింది. కానీ అది నిర్దిష్టంగా ఎప్పుడు, ఎక్కడ వస్తుందో చెప్పటం మటుకు సాధ్యం కావటం లేదు. ఏడెనిమిదేళ్ల క్రితం దక్షిణ కాలిఫోర్నియా, దక్షిణమధ్య అలస్కా ప్రాంతాల్లో చాలా తక్కువస్థాయి ప్రకంపనలు నమోదైనప్పుడు భూ పొరల్లో ఏదో జరుగుతున్నదని, భూకంపం వచ్చే ప్రమాదమున్నదని శాస్త్రవేత్తలు ఊహించారు. ఆ తర్వాత ఉత్పాతం చోటుచేసుకుంది. అయితే సంభావ్యతను 85 శాతం వరకూ ఊహించవచ్చని, నిర్దిష్ట సమయాన్ని చెప్పటం అసాధ్యమనిఅంటున్నారు. ఇందులో చిక్కేమంటే... ముందే చెబితే జనం భయాందోళనల్లో కాలం వెళ్లదీస్తారు. ఆర్థిక కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఆ తర్వాత అంచనాలు తప్పితే అనవసర భయాందోళనలు సృష్టించారని శాస్త్రవేత్తలను తప్పుబడతారు.

# రేషన్ కార్డ్ ఈకేవైసీ గడువును పొడగించాలి

ఐ.ఎఫ్.టి.యు జిల్లా నాయకులు ఎస్.బాలరాజు




కర్నూలు జిల్లా : ఎమ్మిగనూరు రేషన్ కార్డ్ ఈకేవైసీ చేసుకునేందుకు ఏప్రిల్ చివరివరకు గడువు పొడగించాలని ఐ. ఎఫ్.టి.యు జిల్లా నాయకులు ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు.బుధవారం నాడు స్థానిక ఎమ్మిగనూరు డిప్యూటీ తహసీల్దార్ గారికి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డ్ ఈకేవైసీ కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు సమయం ఉందని,కానీ గ్రామీణ ప్రజలు సుదూర ప్రాంతాలకు అయినా హైదరాబాద్ బెంగళూరు గుంటూరు ముంబై ప్రాంతాలకు వలస వెళ్లారని తెలిపారు. అలాగే వరుస సెలవులు పండగలు ఉండడంతో ఈ కేవైసీ పూర్తి చేయడం సాధ్యం కాదని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రేషన్ కార్డ్ ఈ కేవైసీ గడువును ఏప్రిల్ చివరి రోజు వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ అధికారులు ఇంటి వద్దకు వచ్చి ఈ కేవైసి పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి ఎం.సత్యన్న,ఐ. ఎఫ్.టి యు డివిజన్ నాయకులు బాబు,పి.వై.ఎల్ డివిజన్ కన్వీనర్ మునెప్ప,నాయకులు హనుమంతప్ప,రాజు,మునిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల సాధనకై ఉద్యమిద్దాం

ఎస్.మునేప్ప ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి




కర్నూలు జిల్లా : ఎమ్మిగనూరు కార్మిక హక్కుల సాధన కోసం కార్మికుల ఉద్యమించాలని,కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప తెలిపారు. అనంతరం ఎమ్మిగనూర్ సిపిఐ కార్యాలయం లెనిన్ భవనందు ఏఐటీయూసీ కార్మిక సంఘాల అధ్యక్ష కార్యదర్శుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప మాట్లాడుతూ మే డే కు చరిత్రలో ఎంతో ప్రాధన్యత ఉంది,వేలాది మంది అమెరికా కార్మికులు 1886 మే 1న చికాగో నగరంలో హే మార్కెట్ వద్ద పనిగంటలు తగ్గించాలని పని భద్రత కావాలని డిమాండ్ చేస్తు అమెరికా పెట్టుబడి దారి ప్రభుత్వాన్నికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి, ఆ పోరాటంలో అనేకమంది కార్మికుల ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకోవడం జరిగిందని వారు గుర్తు చేశారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కుల హరిస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని, ముఖ్యంగా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేయడాన్ని తక్షణమే విరమించాలి, ప్రభుత్వ రంగాల సంస్థ బ్యాంక్ ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, రైల్వే మార్గం పోస్టల్ డిపార్ట్మెంట్ తదితర ప్రభుత్వ రంగాల్లో సంస్థలను ప్రైవేటుపరం చేయడం ఆపాలి హమలీ ఆటో కార్మికుల ప్రభుత్వ ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారికి నెలకు 3000 పింఛన్ ఇవ్వాలి. భవన నిర్మాణం సంక్షేమ చట్టాన్ని పునరుద్దరించాలి ఇసుక ఉచితంగా సరఫరా చేయాలి ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికునికి ప్రతినెల ఒకటో తేదీ జీతాలు చెల్లించాలి పాత పింఛన్ విధానాన్ని పునరుద్దరించాలి మున్సిపల్ పరిధిలో పనిచేసిన చనిపోయిన కార్మికులు కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి విద్యుత్ మీటర్ రిడర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించాలి కనీస వేతనాలు అమలు చేయాలి ఈ సమావేశంలో ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు పట్టణ కార్యదర్శి విజేంద్ర, సుంకన్న, శివకృష్ణ, వీరాంజనేయులు, కాజా, వీరేష్,వీరేంద్ర,ఈరన్న, నర్సింలు, రాజా, శేఖర్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు

# బ్యాంకర్లు రైతుల నుండి బలవంతపు వసూళ్లు ఆపాలి.

రైతులు రుణాలు చెల్లించడానికి గడువు ఇవ్వాలి.

వైయస్సార్సీపి మండల ప్రధాన కార్యదర్శి బొయ నాగప్ప డిమాండ్



ఆలూరు : ఆలూరు మండలంలో వైయస్సార్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మొలగవల్లి బోయ నాగప్ప మాట్లాడుతూ మండలంలో పలు సొసైటీ బ్యాంకుల్లో రైతులు వ్యవసాయ రుణాలు పలు స్కీముల కింద తీసుకొన్నారు. వ్యవసాయానికి పెట్టుబడి పెట్టరు. వర్షాలు లేక అరకొర పంటలు పండ్డాయి. కనీసం పండిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు లబోదిబోమంటున్నారు. ఈ తరుణంలో సొసైటీ బ్యాంక్ అధికారులు బకాయిలు చెల్లించాలని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. చిప్పగిరి మండలంలోని పలు గ్రామాలలో రైతుల ఇండ్లలో ఉన్న టీవీలు, ఫ్రిజ్లు, బైక్లు, ట్రాక్టర్లు మొదలగు వాటిని తీసికెళ్లడం , బ్యాంక్ అధికారులు జప్తు చేయడం రైతులను అవమానపరచడమేనని ఇలాంటి ఘటనలు ఇంతటితో ఆపేయాలని, పునరావృత్తం కాకుండాగా, కనీసం రుణాలు చెల్లింపుకు గడువు ఇవ్వాలని మండల ప్రధాన కార్యదర్శి బోయ నాగప్ప డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నియోజకవర్గంలోని ఆలూరు ,హాలహార్వి, చిప్పగిరి, హొలగుంద, ఆస్పరి, దేవనకొండ ఆరు మండలాల రైతులతో కలిపి పెద్ద ఎత్తున బ్యాంకుల ముందు నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. బ్యాంకర్లు బలవంతపు వసూళ్లు ఆపాలన్నారు.

# పోలీస్ స్టేషన్ కు సీసీ కెమెరాలు బహూకరించిన నంది శ్రీను

ప్రకాశం జిల్లా , :గిద్దలూరు అర్బన్ పోలీస్ స్టేషన్ కు టిడిపి నాయకులు నంది శ్రీనివాసులు సీసీ కెమెరాలు బహూకరించారు. అసాంఘిక కార్యకలాపాలు చెక్ పెట్టేందుకు సిసి కెమెరాలు, డ్రోన్ ఏర్పాటు చేసేందుకు జిల్లా ఎస్పీ దామోదర్ దాతల సహకారాన్ని కోరారు. ఈ నేపథ్యంలో టిడిపి నాయకులు నంది శ్రీను ఎస్పీ దామోదర్ ఆలోచనలకు ఆకర్షితులై 10 సీసీ కెమెరాలను గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ కు బుధవారం అందించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు ద్వారా దొంగతనాలు అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టే అవకాశం ఉందని సీఐ సురేష్ అన్నారు. అర్బన్ పోలీస్ స్టేషన్ కు 40 వేలు విలువచేసే సీసీ కెమెరాలు అందించిన నంది శ్రీనును సీఐ సురేష్ అభినందించారు.




# రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయాలి



విడపనకల్లు మండలం పోలికి గ్రామంలో పొలంపిలుస్తోంది లో భాగంగా బుధవారం భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం గురించి రైతులకు అవగాహన భూసార సహాయ వ్యవసాయ సంచాలకులు పుష్పాలత భూసార పరీక్ష కేంద్రం ఎరువుల వినియోగం భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా చేసిన చో భూమి యొక్క ఆరోగ్యం కాపాడవచ్చు సేంద్రియ ఎరువుల వినియోగ పెంచినచో భూమి లో కార్బన శాతం వృద్ధి చెంది నాణ్యమైన మరియు అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారుకావున ప్రతి రైతు భూసార పరీక్షలు చేసుకోవటం ద్వారా భూమిలోని పోషల స్థాయికి అనుగుణంగా ఎరువుల వినియోగించవచ్చు అన్నారు ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి, ప్రతాప్ భూసార పరీక్షా కేంద్రం ఏఓ హెచ్ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర, విఎఏ రమేష్ నాయిక్ గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

# :- ఎమ్మెల్యే కేయి శ్యాంకుమార్

## చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

పత్తికొండ :- ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని ఎమ్మెల్యే కేయి శ్యాంకుమార్ తెలిపారు. బుధవారం నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కుల బాధితులకు పంపిణీ చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 14 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 10, 93,600 రూపాయలు మంజూరైందన్నారు.






ఆపదలో ఆర్థిక సహాయం చేస్తూ కుటుంబానికి పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటున్నాడని ఆయన తెలిపారు. మద్దికేర మండలం ఎం అగ్రహారానికి చెందిన జయశ్రీ కి 31112/- రూపాయలు, క్రిష్ణగిరి మండలం క్రిష్ణగిరి గ్రామానికి చెందిన మజ్జిగ లక్ష్మీదేవి కి 81000/- రూపాయలు, టి గోకుల్ పాడు కు చెందిన పింజరి వన్నూరు కి 71000/-రూపాయలు, కోయిలకొండ గ్రామానికి చెందిన చింతమాను గాయత్రి కి 3500/- రూపాయలు, అముకుతాడు గ్రామానికి చెందిన హనుమంతు రెడ్డి వారికి 1,42,680/- రూపాయలు, వెల్దుర్తి మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన ఎముగాని లక్ష్మీదేవి కి 30028/ రూపాయలు, లక్ష్మీనగరం గ్రామానికి చెందిన బాసం లక్ష్మీదేవి కి 23920/- రూపాయలు, తుగ్గిలి మండలం రామలింగాయపల్లి గ్రామానికి చెందిన మహానంది కి 50000/-రూపాయలు, రామకొండ గ్రామానికి చెందిన కే సుజాత కి 49620/- రూపాయలు, చెన్నంపల్లి గ్రామానికి చెందిన కడిమెట్ల హనుమత్ రెడ్డి కి 20000/- రూపాయలు , గుత్తి ఎర్రగుడి గ్రామానికి చెందిన హొసూరు చరణ్ తేజ కి 53150/- రూపాయలు, బొల్లవాని పల్లి గ్రామానికి చెందిన మహేశ్వర్ రెడ్డి కి 201153/- రూపాయలు, పత్తికొండ టౌన్ చెందిన నట్టల సరిత రాణి కి 279378/-రూపాయలు, పత్తికొండ మండలం చందోలి గ్రామానికి చెందిన చాకలి లక్ష్మి కి 25000/- రూపాయల చెక్కులను ఆయన అందించారు. ఈసందర్బంగా బాదితులు ఎమ్మెల్యే కేయి కి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దికేర మాజీ జడ్పీటీసీ పోతుల పురుషోత్తం చౌదరి, తెలుగుదేశం పార్టీ నాయకుడు పందికోన రామానాయుడు, తిమ్మయ్య చౌదరి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ గా ఆప్టా సేవలాల్ నాయక్



కర్నూలు : ఫ్యాప్టో రాష్ట కార్యవర్గ ఆదేశాల ప్రకారం 2025 -27 కు గాను కర్నూలు జిల్లా ఎఫ్ ఏ పి టి ఓ కార్యవర్గ ఎన్నిక కర్నూలు జిల్లా ఎస్ టీ యు భవన్ యందు 26.03.2025 వ సాయంత్రం 5 గంటలకు జరిగింది.ఈ కార్యక్రమం నకు రాష్ట్ర పరిశీలకుడు గా రాష్ట్ర ప్యాప్తో కో ఛైర్మన్ మరియు కర్నూలు జిల్లా ఫాప్తో ఇంచార్జి కాకి ప్రకాష్ రావు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమం యందు 13 సభ్య సంఘాల జిల్లా అధ్యక్షుడు మరియు ప్రధాన కార్యదర్శి హాజరు కావడం జరిగింది. ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్( ఆప్టా) జిల్లా ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్ ను ఫెప్టో కర్నూలు జిల్లా ఛైర్మన్ గా , సెక్రెటరీ జనరల్ గా జి భాస్కర్ (బి టి ఎ),కో ఛైర్మన్ లు గా వై నారాయణ ,వి జి వెంకట రాముడు (డి టి ఎఫ్), ఎస్ గులాబ్ భాష (రూట), రాజేష్ (ఎస్ సి/ఎస్ టి యూనియన్) డిప్యూటీ సెక్రటరీ జనరల్ గా యు రవికుమార్ (యు టి ఎఫ్), టి కె జనార్ధన్ (ఎస్ టి యు), ఎస్ ఇస్మాయిల్ (ఎ పి టి ఎఫ్ 1938), కోశాధికారి గా ఎన్ రంగన్న (ఎ పి టి ఎఫ్ 257) నుండి ఎన్నిక కావటం జరిగింది. ఈ ఎన్నిక కార్యక్రమము లో నవీన్ పాటిల్ (యు టి ఎఫ్), ఎస్ గోకారి (ఎస్ టి యు),మరియనందం(ఎ పి టి ఎఫ్ 1938), తిమ్మప్ప (డి టి ఎఫ్) మధుసుధన్ రెడ్డి (ఆప్టా) మొదలైన జిల్లా నాయకులు పాల్గొనటం జరిగింది.

# నంద్యాల ఐ.ఎం.ఏ ఆధ్వర్యంలో వైద్య సదస్సు..




నంద్యాల వక్తలుగా హైదరాబాద్ అమోర్ హాస్పిటల్ వైద్యులు ఆధునిక చికిత్సా విధానాలతోఎముకల క్యాన్సర్ కు మెరుగైన ఫలితాలు: ప్రముఖ ఎముకలు, కీళ్ల క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్. కిషోర్ రెడ్డి భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, హైదరాబాద్ కూకట్ పల్లి అమోర్ హాస్పిటల్ సహకారంతో మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు నిరంతర వైద్య విద్యా సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్ నిర్వహణలో జరిగిన ఈ సదస్సులో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు. సదస్సులో అమోర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్,సీనియర్ ఎముకలు,కీళ్ల క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కిషోర్ రెడ్డి "ఎముకలు, కీళ్ల చికిత్సలలో ఆధునిక పరిణామాలు"అన్న అంశంపై ప్రసంగిస్తూ ఆధునిక పరికరాల సహకారంతో నెలల పిల్లల నుండి వృద్ధాప్యంలో ఉన్న వారి వరకు ఎముకలకు వచ్చే కాన్సర్ లకు నూతన శస్త్ర చికిత్స విధానాల ద్వారా మెరుగైన, నిర్దిష్ట ఫలితాలు సాధించడానికి అవకాశం ఏర్పడిందన్నారు. అవయవాలకు ప్రమాదాలలో వికలత్వం వస్తే మామూలు స్థాయికి తీసుకువచ్చే పునర్నిర్మాణ శస్త్ర చికిత్సలు గొప్ప వరంగా మారాయి అన్నారు. అమోర్ హాస్పిటల్ పరిపాలనాధికారి, ఎముకలు, కీళ్ళ నిపుణులు డాక్టర్ బుడ్డా శ్రీకాంత్ రెడ్డి సదస్సులో మాట్లాడుతూ అమోర్ హాస్పిటల్ లో ఎముకలు కీళ్ల అత్యాధునిక శస్త్ర చికిత్సల విభాగంతో పాటు వివిధ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ విభాగాలలో ప్రజలకు ఆధునిక చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. తమ ఆసుపత్రి సేవా దృక్పథంతో రోగులకు సహకరిస్తుందన్నారు.వక్తలను ఐఎంఏ నంద్యాల జ్ఞాపికలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ పనిల్ కుమార్, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ కాతా మధుసూదన్ రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, నంద్యాల ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ వసుధ రాణి, అమోర్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ సీతారామమూర్తి,అధిక సంఖ్యలో నంద్యాల ప్రాంత వైద్యులు పాల్గొన్నారు.

# పోషణ బి పడాయిభీ అంగన్వాడీ కార్యకర్తల మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు.




ఆత్మకూరు : నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామంలో జడ్పీహెచ్ హైస్కూల్ నందు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ముగించడం జరిగింది, ఈ శిక్షణలో భాగంగా మొదటి రోజు 0 నుంచి 5 సంవత్సరాల పిల్లల యొక్క పోషణ మరియు విద్య, రెండవ రోజు పిల్లల యొక్క లోప పోషణ గుర్తింపు పిల్లల యొక్క బరువులు ఎత్తులు తూచడం ద్వారా లోప పోషణ కలిగిన పిల్లలను గుర్తించి వారి యొక్క సలహాలు సంప్రదింపులు, వారిని ఎలా సంరక్షించాలి, సమతుల ఆహారంపై అవగాహన కార్యక్రమం పై శిక్షణ ఇవ్వడం జరిగింది, మూడవ రోజు దివ్యాంగుల పిల్లలను ఎలా గుర్తించాలి, పుట్టినప్పటినుంచి ఆరు సంవత్సరాల్లో పిల్లలను పిల్లలను అంగవైకల్యం ను గుర్తించి, తల్లిదండ్రులకు సలహాలు సూచనలు ఎలా ఇవ్వాలి అనే కార్యక్రమం పై అవగాహన కల్పించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ ఎ సి డి పి ఓ మంగావల్లి గారు, ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు నాగేశ్వరమ్మ, ఆశీర్వాదమ్మ, మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# రామాలయ నిర్మాణానికి స్థలం ఇప్పించాలి .



ఆదోని : : అమరావతి నగర్ వార్డు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ ఆధ్వర్యంలో అమరావతి నగర్ ప్రజలతో కలిసి కౌన్సిలర్ లలితమ్మ ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి వాల్మీకి ని కలిసి వినతిపత్రం సమర్పించి వార్డు లోని న్యూ అమరావతి నగర్ కాలనీ దాదాపు 400 కుటుంబాలు నివాసం ఉంటున్నారని వారందరికీ హిందూ దేవాలయం లేదని అందువల్ల పండుగలకు, పెళ్ళిళ్ళు చేసుకొనుటకు పేద ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉందని కౌన్సిలర్ లలితమ్మ ఎమ్మెల్యే పార్థసారథి గారికి వివరించారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గారు తప్పకుండా కాలనీలో దేవస్థానము నిర్మించుకోవడానికి రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్థలం కేయించే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను కలవడానికి వచ్చిన కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ తో పాటుగా కాలనీ మహిళలు, యువకులు ఎమ్మెల్యే పార్థసారథి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, సీనియర్ నాయకుడు దేశాయ్ చంద్రన్న, అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్,వెల్లాల మధుసూదనశర్మ, నూర్జహాన్, పరుశురాం పెద్ద ఎత్తున కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# వక్ఫ్ బిల్లుపై పార్లమెంట్లో వ్యతిరేకించాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత అన్ని మైనార్టీ సంఘాలపై లౌకికవాదులపై ఉంది...




నంద్యాల. : ముస్లిం హక్కుల పోరాట సమితి వక్ఫ బోర్డు చట్టంలోని సవరణలు తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తుందని ముస్లిం హక్కులపోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి యూను స్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. త్వరలో పార్లమెంట్లో చర్చకు రానున్న ఈ బిల్లును వ్యతిరేకించే విధంగా తెలుగుదేశం పార్టీపై ఒత్తిడి తీసుకురావడానికి అన్ని రకాలుగా రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రజాసంఘాలు కృషి చేశాయని ఆయన తెలిపారు. అయినప్పటికీ ఈ బిల్లుకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఇవ్వబోతుందని తెలుస్తుందని ఇది విచారకరమని మైనార్టీల మనోభావాలను గాయపరచట్టమేనని ఆయన అన్నారు. కొంతమంది తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్ఆర్సిపి గతంలో బిజెపి తేచ్చిన అనేక చట్టాలకు మద్దతు ఇచ్చిందని ప్రకటిస్తున్నారని వైసీపీ కంటే తెలుగుదేశం పార్టీ ముస్లింలకు ఎక్కువ న్యాయం చేసిందని చెబుతున్నారని అయితే ఇక్కడ తెలుగుదేశం పార్టీ న్యాయం చేసిందా వైఎస్ఆర్సిపి న్యాయం చేసిందా అనేది ప్రస్తుతం చర్చనీయాంశం కాదని ఈ బిల్లు వలన ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతుందని కాబట్టి ఏ విధంగా అయినా ఈ బిల్లును అడ్డుకునే విధంగా అందరూ కృషి ఆయన తెలిపారు. ఈ బిల్లులో తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ సభ్యులు శ్రీకృష్ణదేవరాయలు కొన్ని సవరణలు సూచించినప్పటికీ అవి ఎంత మాత్రం సరిపోవని ఈ బిల్లు ప్రకారం బోర్డులో చేసే కమిటీలలో ముస్లిం లు కాని వారికి స్థానం కల్పించటం చాలా అభ్యంతర కరమని ఆయన అన్నారు. ముస్లింల సంస్థలలో హిందువులకు స్థానం కల్పిస్తే హిందూ దేవాలయ కమిటీలలో ముస్లింలకు స్థానం కల్పిస్తారా అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి పెక్కు అంశాలు ఈ బిల్లులో ఉన్నాయని అందుకోసమే దేశవ్యాప్తంగా ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారని కాబట్టి చంద్రబాబు తమ నిర్ణయాన్ని పునః పరిశీలించి ఈ బిల్లు చట్ట రూపంలో రాకుండా ఉండే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. చంద్రబాబు గ బిజెపితో పొత్తు పెట్టుకున్నప్పటికీ ముస్లింలు మద్దతు తెలిపారని బాబు ని ఎప్పుడు సెక్యులర్ వాదిగానే ముస్లింలు చూస్తారని బాబు పై ఉన్న విశ్వాసాన్ని బాబు నిరూపించుకోవాలని ఆయన కోరారు. రాజకీయ నాయకులు ఇచ్చే ఇఫ్తార్ విందులలో ముస్లింలు పాల్గొనటం పాల్గొనకపోవడం వారి విజ్ఞతకే వదిలి పెట్టాలని వారిపై ఒత్తిడి తేవడం మంచిది కాదని ఆయన ముస్లిం హక్కుల పోరాట సమితి రాజకీయ నాయకులు ఇచ్చే ఇఫ్తార్ విందుల లో పాల్గొన్న రాదని నిర్ణయించిందని మిగతా సంఘాలు వారి ఇష్ట ప్రకారం నడుచుకోవచ్చని ఆయన అన్నారు

# వేసవిలో తరచూ నీరు తాగాలి: వేణుగోపాల్



మండల పరిధిలోని చాబాలలో హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎండలో ఎక్కువ తిరగడం, నీరు తక్కువ తీసుకోవడంతో శరీర ఉష్ణోగ్రత పెరిగి, నీటి శాతం తగ్గిపోయి వడదెబ్బ బారిన పడాల్సి వస్తోందన్నారు. వడదెబ్బకు గురైన వారు సకాలంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాలు సైతం కోల్పోయే పరిస్థితిలో ఉంటాయన్నారు. సర్పంచ్ మల్లెల జగదీష్, సిహెచ్ఐ పావని, విజయ్ పాల్గొన్నారు.

# నేడు పీలేరుమండల ప్రజా పరిషత్ కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక.

పీలేరు : పీలేరు మండల ప్రజా పరిషత్ కోఆప్షన్ సభ్యుని ఎన్నిక గురువారం ఉదయం 10 గంటలకు నామినేషన్లు స్వీకరిస్తారని మధ్యాహ్నం ఒంటిగంటతో మండల ప్రజా పరిషత్ కోఆప్షన్ సభ్యుని ఎన్నిక కార్యక్రమం పూర్తవుతుందని మండల ప్రజా పరిషత్ రిటర్నింగ్ అధికారి ఒక ప్రకటనలో మీడియాకు తెలియజేశారు.

# లక్ష విరాళం అందించిన మాజీ జెడ్పిటిసి చౌదరి

## - ఈఓ రెబ్బా వీరయ్య



మద్దికేర :- మద్దికేర మండలం పెరవలి గ్రామంలో వెలసిన శ్రీభూదేవి రాజ్యలక్ష్మి సమేత శ్రీరంగనాథ స్వామి తూర్పు రాజ గోపురం నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన వారికి మద్దికేర మాజీ జెడ్పిటిసి పోతుల పురుషోత్తం చౌదరి లక్ష రూపాయలు విరాళం ఇచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహనాధికారి రెబ్బా వీరయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తూర్పు రాజ గోపురం నిర్మించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ వారిచే అనుమతులు వచ్చాయని తెలిపారు. ఐతే ముందు భాగంలో కొందరు వ్యక్తుల నివాస గృహాలు ఉన్నాయని, వారితో గ్రామ పెద్దలతొ చర్చించి, నివాస గృహాలు ఖాళీ చేసేందుకు వారిని ఒప్పించి, ప్రత్యాన్మాయంగా కొంత సొమ్ము చెల్లిస్తున్నామని ఆయన తెలిపారు. అందులో భాగంగా పురుషోత్తం చౌదరి వారికి లక్ష రూపాయలు అందించాడని ఆయన తెలిపారు. తూర్పు రాజ గోపురం నిర్మాణం కోసం భక్తులు, దాతలు విరివిగా విరాళాలు అందివ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కోమందూరి రంగనాథాచార్యులు, పాలకమండలి మాజీ అధ్యక్షులు బారిక ఆంజనేయులు, దస్తగిరి గౌడ్, పలువురు పాలకమండలి మాజీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం మానవునికి ఆరోగ్యం



పత్తికొండ :- ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా మానవునికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల ఇన్చార్జి మల్లికార్జున తెలిపారు. బుధవారం పత్తికొండ మండలం దేవనబండ యూనిట్ గ్రామాలైన నలకదొడ్డి, చిన్నాహల్తి గ్రామాలలోని రైతులతొ ప్రకృతి వ్యవసాయం పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ పై రైతులకు అవగాహన కల్పించి, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి రైతు తన పొలం లొ ఎకరా సాగు చేయాలని, పొదుపు మహిళా సంఘాల ద్వారా ఇంటి దగ్గర పెల్లి తోటలు పెంచేవిధంగా రూపకల్పన చేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తన అనుభవాలను తోటి రైతులతో పంచుకున్నారు. విత్తన గుళికల తయారి విధానం, వాటి ఉపయోగాలు రైతులకు వివరించారు. వాల్ పోస్టర్స్, ప్లే కార్డ్స్ తొ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డియంయంటి రంగాస్వామి, ఐసిఆర్పియస్ అదేప్ప, భులక్ష్మి, రీటా, మర్తమ్మ, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎంపీపీ ఉప ఎన్నిక

## - ఎన్నికల అధికారి అజయ్ కుమార్



తుగ్గలి :- తుగ్గలి మండలపరిషత్ అధ్యక్ష ఎన్నిక కి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి హెచ్ఎన్ఎస్ ప్రాజెక్టు భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలి లోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 11.00 గంటల కు ఎంపీపీ ఉపఎన్నిక పై ఎంపీటీసీ ల తో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలొ ఎంపీటీసీ సభ్యులు అందరూ కలిసి ఎంపీపీ ని ఎన్నుకుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వమోహన్ పాల్గొన్నారు.

# శ్రీశైలం నియోజకవర్గ టిడిపి విస్తృతస్థాయి సమావేశలో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి.

(తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత)

(కార్యకర్తల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక కృషి)



ఆత్మకూరు , అఘాదంలో ఉన్న రాష్ట్రాన్ని అధికారంలోకి వచ్చిన 8నెలల్లోనే సిఎం చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి సూపర్ సిక్స్ హామీని నెరవేర్చుతాం.. ఆపద్దాలు చెప్పడంలో వైసీపీ నాయకులు గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు.. వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టి, ఎన్డీయే కూటమి పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి.. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం సిఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర అభివృద్ధి.. టిడిపి సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే టాప్ 20లో నిలిచాం.. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన శ్రీశైలం ఎమ్మెల్యేబుడ్డా రాజశేఖర రెడ్డి ఆత్మకూరులో జరిగిన శ్రీశైలం నియోజకవర్గ టిడిపి విస్తృత స్థాయి సమావేశంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ..

# తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ మార్చి 31 వరకే.

**అవకాశం-ఇప్పటివరకు పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలి-పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్)**

ప్రతి పేద ఆడబిడ్డకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని, దీపం-2 పథకంలో తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇప్పటి పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలన్నారు ఇప్పటివరకు 98 లక్షల మంది తొలి ఉచిత సిలిండర్ వినియోగించుకున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు.

## ఏపీలో సూపర్ సిక్స్ హామీ నిలబెట్టుకుంటున్న కూటమి సర్కార్

01నవంబర్ 2024న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా దీపం 2 పథకానికి శ్రీకారం చుట్టారు. దీపం -2 పథకంతో ప్రతి పేద వాడి ఇంట్లో దీపపు కాంతులు విరాజిల్లుతున్నాయి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా దీపం-2 పథకం రూపొందించడం జరిగింది. దీపం-2 పథకానికి రూ.2,684 కోట్లు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఉచిత సిలిండర్ కావాల్సిన వారు సాధారణ పద్ధతిలో ముందుగా సొమ్ము చెల్లించవలసి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో బుక్ చేసిన 24 గంటల లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల లోపు గ్యాస్ డెలివరీ ఇస్తారు.ఆ తర్వాత సిలెండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు చెల్లించిన పూర్తి సొమ్మును లబ్దిదారుల ఖాతాల్లో తిరిగి జమ అవుతుందన్నారు ఒక సంవత్సరంలో 3 గ్యాస్ సిలిండర్లు ఇలా ఉచితంగా పంపిణీ చేస్తారు. అయితే వీటిని ఒకేసారి కాకుండా నాలుగు నెలలకు ఒకసారి బుక్ చేసుకునే అవకాశం కల్పించారు.

## ప్రతి ఏడాది

ఏప్రిల్ - జూలై (01), ఆగష్టు నవంబర్ (01), డిసెంబర్ మార్చి (01) మధ్య ఉచిత గ్యాస్ సిలెండర్ బుక్ చేసుకోవచ్చు.

## ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడానికి అర్హతలు

1)ఎల్.పి.జి.కనెక్షన్ కలిగి ఉండటం 2) రైస్ కార్డ్, 3) ఆధార్ కార్డు 4). ఆధార్ కార్డుతో రైస్ కార్డుతో అనుసంధానం అయి ఉండాలి ఎటువంటి సమాచారం లోపం ఉన్న టోల్ ఫ్రీ నెం.1967 కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు....

# జపాన్ - ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మక భాగస్వామ్యం: పెట్టుబడులకు కొత్త అవకాశాలు

**"జపాన్ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ కీలక గమ్యం"**

**'జపాన్ కనెక్ట్ విత్ ఆంధ్రప్రదేశ్' సెమినార్‌లో శ్రీసిటీ ఎండీ,**




శ్రీసిటీ, : భారతదేశంలోని జపాన్ రాయబారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి (ఈ.డి.బి), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్.ఐ.సి.సి.ఐ) సంయుక్తంగా, "పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంబంధాలు విద్య" అంశాలపై నిర్వహించిన సెమినార్ బుధవారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం జపాన్-ఆంధ్రప్రదేశ్ మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి వేదికగా నిలిచింది. ఈ సదస్సులో భారతదేశంలో జపాన్ రాయబారి ఓనో కెయిచీ, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి, పాల్గొన్నారు. ఎఫ్.ఐ.సి.సి.ఐ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డా. గుణవీనా చద్దా సమన్వయం చేయగా, విశ్వ సముద్ర హోల్డింగ్స్ మేనుఫ్యాక్చరింగ్ సి.ఈ.ఓ జితేంద్ర నిమ్మగడ్డ అతిథులకు స్వాగతం పలికారు. . జపాన్ రాయబారి ఓనో కెయిచీ, భారతదేశంతో జపాన్ వ్యాపార సంబంధాలను ప్రోత్సహించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. జపనీస్ పెట్టుబడులకు శ్రీసిటీ ప్రధాన వేదికగా మారిందని గుర్తు చేశారు. మంత్రి టి.జి. భరత్ పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక సహకారాన్ని మరింతగా పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్-జపాన్ కనెక్ట్ విధానం ద్వారా జపనీస్ కంపెనీలను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యూహాలను మంత్రి భరత్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దార్శనిక నాయకత్వాన్ని ప్రశంసించిన డా. రవీంద్ర సన్నారెడ్డి, జపాన్-భారత సంబంధాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న వ్యూహాత్మక నిర్ణయాలను, తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. దక్షత గల నాయకత్వం, విదేశీ పెట్టుబడుల కోసం స్నేహపూర్వక వాతావరణం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక భౌగోళిక స్థానం, మొదలగు కారణాల వల్ల పెట్టుబడులకు రాష్ట్రం కీలక గమ్యంగా మారిందని ఆయన పేర్కొన్నారు. శ్రీసిటీ ప్రస్తుతం భారతదేశంలో రెండో అతిపెద్ద జపనీస్ టౌన్‌షిప్ గా రూపుదిద్దుకున్నదని తెలియజేశారు. ప్రస్తుతం ముప్పై ఒక్క జపనీస్ కంపెనీలు శ్రీసిటీలో అధునాతన ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాయని వివరించారు. నైపుణ్య అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, స్థిరమైన పారిశ్రామికీకరణ వంటి అంశాల్లో శ్రీసిటీ ప్రధాన పాత్ర పోషిస్తోందని, తద్వారా స్థానిక ప్రజలకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. జపాన్-ఆంధ్రప్రదేశ్ మధ్య పెట్టుబడుల విస్తరణ, ప్రజల మధ్య సంబంధాల అభివృద్ధి, విద్య, మౌలిక సదుపాయాలు, సాంకేతికత రంగాల్లో కొత్త అవకాశాలను అన్వేషించే దిశగా కట్టుబడి ఉన్నట్లు వెల్లడిస్తూ ఈ సదస్సు ముగిసింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్, భారతదేశంలోని జపాన్ వ్యాపార కేంద్రంగా మరింతగా ఎదుగుతుందని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు

# సమిష్టిగా కేవీబి పురం మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం...!!

**బాధిత కుటుంబాలకు సీఎం**

**రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ...!!**

**మృత్యువాత పడ్డ కుటుంబాలకు**

**ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శ...!!**

**జనసేన, బిజెపి అధ్యక్షులకు అధికారులు**

**10 శాతం పనులు కచ్చితంగా కల్పించాలి...!!**

**ముఖ్యమంత్రి ఆదేశాన్ని ధిక్కరిస్తే**

**అధికారులపై చర్యలు తప్పదు...!!**

**సత్యవేడు నియోజకవర్గ ఉమ్మడి**

**టిడిపి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.**



కెవిబిపురం : తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీ నేతలు అందరూఐకమత్యంతో సమిష్టిగా కేవీబీ పురం మండలాన్ని సమగ్ర అభివృద్ధి చేసుకుంటామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కే వి బి పురం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే ఆదిమూలం రివ్యూ నిర్వహించారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు అభివృద్ధి జరగాలంటే అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రతి శాఖ అధికారి ద్వారా ఏ ఏ పనులు జరుగుతున్నాయో సమీక్ష సమావేశంలో రివ్యూ నిర్వహించారు. ప్రజలకు సేవ చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని ఒక దశలో అధికారులపై సైతం ఆవేశం వెలగక్కారు. వేసవి కాలం కాబట్టి కె వి బి పురం మండలంలోని ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సమీక్ష సమావేశానికి కొంతమంది అధికారులు ఆలస్యంగా రావడంతో ఎమ్మెల్యే ఆదిమూలం వారిని తీవ్రంగా మందలించారు. సమాచారం ఉండి కూడా ఆలస్యంగా వస్తున్నారంటే ఏమిటని ప్రశ్నించారు. ఒక శాసనసభ్యుడు సమీక్ష సమావేశానికి వస్తున్నారంటే అధికారులు ఆలస్యంగా రావడం ఏమిటి అని ఒక దశలో తీవ్రంగా ఆవేశపడ్డారు. ఇలా ఉంటే ప్రజలకు ఎలాంటి సేవ చేస్తున్నారో అర్థం అవుతుందని హెచ్చరించారు. ఏ శాఖ నుంచి కూడా ప్రజలు ఆ శాఖ అధికారులు పనిచేయడం లేదని సమాచారం వస్తే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటో ఏర్పాటు చేయకపోవడంపై అధికారులపై తీవ్రస్థాయిలో ఆవేశ వెలగెక్కారు. దగ్గరుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటో ఎమ్మెల్యే ఆదిమూలం ఏర్పాటు చేయించారు. ప్రతివారం కేవీబీ పురం మండలంలో పర్యటిస్తానని తెలిపారు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి గృహ నిర్మాణాలు ఆన్లైన్లో ఎక్కించాలని ఏఈ దినేష్ ను ఆదేశించారు. పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు ఎప్పటికప్పుడు అందించాలని పశువైద్యాధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా వేసవి కాలంలో ఎక్కడ ఇబ్బందులు లేకుండా తగు చర్ల చేపట్టాలని ఆ శాఖ ఏ ఈఎమ్మెల్యే ఆదిమూలం ఆదేశించారు. వెలుగు ద్వారా మహిళా గ్రూపులకు విరివిగా ప్రభుత్వ ఆదేశానుసారం లోన్లు మంజూరు చేయాలని ఎక్కడ సమస్య రాకుండా అన్ని గ్రూపులకు ప్రభుత్వం అందించే గ్రూప్ లోన్లు అందించాలని ఏపీఎం చంద్రకళను ఎమ్మెల్యే ఆదిమూలం ఆదేశించారు. ఇప్పటివరకు వెలుగు కార్యాలయం ద్వారా మహిళా గ్రూపులకు అందుతున్న ప్రభుత్వ సహాయాన్ని వివరాలతో సహా ఎమ్మెల్యే ఆదిమూలంరాబట్టారు.ఉదయం 10 గంటలకు పిచ్చటూరు టీచర్స్ కాలనీకి చేరుకొని పది రోజుల క్రితం మరణించిన యువకుడు ఈశ్వర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పుష్పాంజలి ఘటించారు. అక్కడ నుండి కేవీబి పురం ఎంపీడీఓ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో విభేదాలు మాని, అభివృద్ధికి సహకరించాలని నేతలను, ప్రజా ప్రతినిధులను కోరారు. అలాగే మన చంద్రన్న ప్రభుత్వం అమలు చేయనున్న సొంత ఇల్లు లేని పేదలకు 3 సెంట్లు ఇంటి పట్టాల పంపిణీ, పక్కా ఇళ్లు నిర్మాణం, కొత్త రేషన్ కార్డు, కొత్త ఫించను పంపిణీ పథకాలను కుల,మత, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి చేరవేసేందుకు కృషి చేయాలన్నారు.తద్వారా ప్రభుత్వానికి, తెలుగుదేశం పార్టీకి మంచి పేరు తేవాలని, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ అయ్యే విధంగా స్థానిక నేతలు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దిశా, నిర్దేశం చేశారు. కే వి బి పురం బి ఎన్ కండ్రిగ మండలానికి చెందిన ఇరువురికి సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు చెక్కులను ఎమ్మెల్యే ఆదిమూలం బాధితులకు అందించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు మల్లికార్జున రెడ్డి విజయ్ కుమార్ నాయుడు కేశవులు నాయుడు. జనసేన మండల కన్వీనర్ థామస్ బిజెపి మండల కన్వీనర్ బాబు యాదవ్ మాజీ ఎంపీపీ సుబ్రమణ్యం సర్పంచులు బాలాజీ చంద్రబాబు. నేతలు చెంగారెడ్డి ప్రొఫెసర్ రమేష్ అయ్యప్ప అదేవిధంగా తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం వగతూరు లో పార్టీ నేత సురేష్ రెడ్డి మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో .అనంతరం బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అక్కడ నుండి వగత్తూరు చేరుకొని ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ అవసరం సురేష్ మాతృమూర్తి జయలక్ష్మి చిత్రపటానికి ఎమ్మెల్యే పుష్పాంజలి ఘటించారు. అనంతరం సురేష్ ను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రకటించారు

# స్మార్ట్ మీటర్లు వద్దు ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలి.

(ఈనెల 28న విద్యుత్ కార్యాలయం ముందు జరిగే ధర్నా ను జయప్రదం చేయండి )




ఆత్మకూరు ఆత్మకూరు: స్మార్ట్ మీటర్లు వద్దు ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని ఈ నెల 28వ తేదీన ఆత్మకూరు విద్యుత్ కార్యాలయం ముందర జరిగే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఎ. రణధీర్, మండల కార్యదర్శి పి సుధాకర్ లు కోరారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ ఎ. ధనుంజయ మీటింగ్ హాల్ నందు జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ బారాలపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని ట్రూ డౌన్ పేరుతో మబ్య పెట్టె ప్రచారం సరికాదని అన్నారు. ఏపీ ట్రాన్స్ కో 2014 నుంచి 2019 సంవత్సరాలకు సంబంధించి రూ ఒక వెయ్యి 50 కోట్లు ఆదాయ ఖర్చులో మిగులు వచ్చిందని ఆ మేరకు ట్రూడౌన్ ద్వారా వినియోగదారులకు భారం తగ్గిస్తున్నట్లు ప్రచారం చేయడం సరి కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలల కాలంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోగా రూ.15,485 కోట్లను అదనంగా సర్దుబాటు చార్జీ భారాన్ని ప్రజలపై మోపి బలవంతంగా వసూలు చేస్తున్నారు. ఇది కాకుండా యూనిట్కు ప్రతినెల రూ,0.40 పైసలు చొప్పున సర్దుబాటు చార్జీలు వసూలు చేస్తున్నారు. నూతన విద్యుత్తు లైన్లో ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేసిందన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు బిగించమని కరెంటు చార్జీలు పెంచమని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు గత ప్రభుత్వంపై సాకు చెప్పడం కరెక్ట్ కాదన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో వేలాది కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతో కేంద్రం ఈ స్మార్ట్ మీటర్లను రుద్దుతోందన్నారు. కావున పట్టణ ప్రజలు స్మార్ట్ మీటర్లు వద్దు ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన విద్యుత్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మండల నాయకులు చందా వారి వెంకటేశ్వర్లు, నాయకులు డి రామ్ నాయక్, ఏ సురేంద్ర, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

# సత్యవేడు నియోజకవర్గంలో దళితులపై పోలీసులు కేసులు పెట్టకండి..!!


**ఉమ్మడి పార్టీ నేతలారా దళితులపై కేసులు పెట్టించకండి...!!**

**నియోజకవర్గం లోని ఏడు మండలాలు ఉమ్మడి టిడిపిలో అభివృద్ధి చెందాలని ఆకాంక్ష...!!**

**దళితులు సాగు చేసుకుంటున్న అటవీ భూముల్లో ఫారెస్ట్ అధికారులు వేధింపులు మానాలి....!!**

**ఉమ్మడి టిడిపి ప్రభుత్వంలో ఏడు మండలాల్లో ఉమ్మడి దళిత పార్టీ నేతలు స్వచ్ఛందంగా ఎదగాలి...!!**

**వారికి అన్ని విధాల సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తా.**



కెవిబిపురం ఉమ్మడి టిడిపి ప్రభుత్వంలో సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో దళితులపై కేసులు పోలీసులు పెట్టవద్దని, అదేవిధంగా ఉమ్మడి పార్టీ నేతలు సైతం దళితులపై కేసులు పెట్టించవద్దని సత్య వేడు నియోజకవర్గ ఉమ్మడి టిడిపి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బుధవారం కే వి బి పురం మండల కేంద్రంలోని ఎంపీడీవో ఛాంబర్ లో ఎమ్మెల్యే ఆదిమూలం ప్రత్యేక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఉమ్మడి పార్టీ తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీ నేతలు (దళిత నేతలు) స్వచ్ఛందంగా ప్రభుత్వ కాంట్రాక్టు పనులు చేసుకోవాలని దానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. 7 మండలాల్లో దళితులు ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటుంటే ఫారెస్ట్ అధికారులు దళిత రైతులపై కేసులు పెట్టడం మానుకోవాలని తెలిపారు. అదే విధంగా ఏడు మండలాల్లో ఉమ్మడి పార్టీ నేతలు ఐక్యమత్యంతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకోవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యా శాఖ మంత్రి లోకేష్ నేతృత్వంలో నియోజకవర్గానికి అన్ని విధాల అభివృద్ధి చేసుకోవడానికి నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. నియోజకవర్గంలో గోకులం షెడ్లు అత్యధికంగా తెప్పించాలని తెలిపారు ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాల అభివృద్ధి చేయుటకు విద్యాశాఖ మంత్రి లోకేష్ తీవ్ర కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అధికారులు సక్రమంగా పనిచేయకపోతే ఉపేక్షించేది లేదని ఒక ప్రశ్నకు సమాధానం గా ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. కే వి బి పురం మండలంలో విలేకరులకు ఇంటి స్థలాలు త్వరలో ఇప్పిస్తానని హామీ ఇచ్చారు

# తూకాలు లేకుండా బియ్యం డీలర్‌లకు బియ్యం పంపిణీ .

## గతనెలలో 80 ప్యాకెట్లు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ...




ఆలూరు : ఆలూరు నియోజకవర్గంలోని ఆయా మండల కేంద్రాలకు సంబంధించి రేషన్ బియ్యాన్ని ఆలూరు గోడౌన్ నందు నిల్వ చేస్తారు.అక్కడనుండి ఆయా గ్రామాల స్టోర్ డీలర్ లకు పంపిణీ చేయడానికి ఆలూరు గోడౌన్ నుండి తరలిస్తారు.నెల చివరి రోజున స్టోర్ డీలర్లు వారి వాహనాన్ని అక్కడికి తీసుకు వచ్చి వారికి తగిన కేటాయింపు బియ్యాన్ని గోడౌన్ అధికారులు వారి హమాలీలతో లోడ్ చేయిస్తారు.ఇక్కడే అసలైన మతల ఉంటుందని పలువురు డీలర్లు పేర్కొంటున్నారు.ఇదే విషయంపై బుధవారం రోజున విలేకరులు అక్కడికి వెళ్లి అక్కడ జరిగే రేషన్ పంపిణీ తీరును పరిశీలించగా అక్కడ వారు ఏ ఒక్క బియ్యపు మూటను తూకం వేయకుండా డీలర్లు తీసుకొచ్చిన వాహనాల్లోకి నేరుగా లోడ్ చేయడం కనిపించింది. దీనిపై విలేకరులు రేషన్ పంపిణీ చేయిస్తున్న ఆర్ఐ శివన్నను , కంప్యూటర్ ఆపరేటర్ చిన్నాను వివరణ అడగగా వారు లేదు మాకు నచ్చినట్లు మేము చేస్తాం.ఇక్కడ తూకాలు వేయం.ఇది ఎప్పటి నుండో ఇక్కడ ఇలాగే జరుగుతుంది ఇష్టమున్న డీలర్లు రేషన్ తీసుకెళ్లవచ్చని లేకపోతే తామేమి చేయలేము అంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు.మాకు దీని గురుంచి సరిగా తెలియదు ప్రతి మూటను తూకం వెయ్యము.కాటామిషన్ పనిచెయ్యదు నేను ఏదో కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చాను అంతే గానీ నాకు ఇక్కడ నేను ఏమి చేయాలో ఇక్కడ పరిస్థితి తనకు ఏమీ తెలియదు అంటూ విచిత్ర సమాధానం ఇచ్చారు.అదేవిధంగా కొద్ది రోజుల క్రితం 80 బియ్యం బస్తాలు పక్కదారి పట్టినట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.ఆలూరు గోడన్లో జరుగుతున్న అవినీతి తతంగంపై సమగ్రంగా విచారిస్తే మరిన్ని అక్రమాలు వెలుగు చూస్తాయని,జిల్లా కలెక్టర్ తో పాటు ఉన్నతాధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు, కార్డుదారులు కోరుతున్నారు.

# కాళంగి కలతూర్ రిజర్వాయర్లను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు.



కెవిబిపురం : కేవీబీ పురం మండలంలోని కాలంగి రిజర్వాయర్ కళత్తూరు పెద్ద చెరువు రిజర్వాయర్ ఆరే జలాశయాన్ని చెరువుని మరీయుఓళ్ళూరు లోని రాయలచెరువు జలాశయాన్ని సందర్శించిన ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర రాజు, ఈఈలు మధన్ గోపాల్, శివారెడ్డి, డీఈ, ఏఈలు మరియురాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కె వి బి పురం మండలం క్లస్టర్5 ఇంచార్జ్ మునస్వామి ?దవ్ కాలంగి రిజర్వాయర్ చైర్మన్ రాజా రెడ్డి గారు రాయల్ చెరువు చైర్మన్ బాబు శెట్టి ఆరే రిజర్వాయర్ చైర్మన్ శివ ప్రసాద్ ఆరే చెరువు మాజీ చైర్మన్ ప్రకాష్ నాయుడు ఓలురు సర్పంచ్ సురేష్ చౌదరి కే వి బి పురం మండలం యువ నాయకులు సాయి కృష్ణ చౌదరి తిరుపతి పార్లమెంట్ పాలు ఏకరి సాధికారిక సమితి అధ్యక్షులు వెంకట కృష్ణయ్య ఆరె సర్పంచ్ దాము ఆరే గ్రాము కమిటీ అధ్యక్షులు రాజారాం యువ నాయకులు యూనిట్ ఇంచార్జి రాము నాయుడు మునిరత్నం అఖిల్ బాలు కెవిబి పురం మండలం నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# అరాచక శక్తులను ఉక్కుపాదంతో అణచివేస్తాం

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



పెనుకొండ : రాజకీయ, వ్యక్తిగత కక్షల పేరుతో సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, అరాచక శక్తులను ఉక్కు పాదంతో అణచివేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత హెచ్చరించారు. వ్యక్తిగత ఘర్షణలకు రాజకీయ రంగు పులిమి సమాజంలో అల్లకల్లోలం సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అభివృద్ధికి, సంక్షేమానికి విఘాతం కలిగిస్తూ, హత్యలకు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటివారైనా ఉపేక్షించొద్దని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వి.రత్నకు మంత్రి సవిత ఆదేశించారు. రామగిరి మండలం పాపిరెడ్డి పల్లిలో జరిగిన వ్యక్తిగత ఘర్షణలో కురుబ లింగమయ్య గాయపడి, అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. లింగమయ్య మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకొస్తుండగా, మార్గం మధ్యలో మంత్రి సవిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘర్షణలో లింగమయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘటనకు రాజకీయ రంగు పులమడం సరికాదన్నారు. ఈ మేరకు సోమవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయుడు పాలనా దక్షతతో ఇపుడిపుడే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా జోరందుకున్నాయన్నారు. ఇటువంటి సమయంలో సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలకు తావే లేదన్నారు. అరాచక శక్తులను ఉక్కు పాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ, సమాజంలో అశాంతికి కారణమయ్యే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రత్నను మంత్రి సవిత ఫోన్లో ఆదేశించారు. అరాచక శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి గాసిప్ లూ నమ్మొద్దని, ప్రభుత్వానికి, పోలీసులకు సహకరించాలని మంత్రి సవిత కోరారు.

# గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే తొలి ప్రధాన్యం

## ప్రజలు ఎక్కడా ఇబ్బందులు పడకూడదు

## బీసీ సంక్షేమ చేనేత జౌలి శాఖ మంత్రివర్యులు సవిత

పెనుకొండ్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత అని మంత్రి సవితమ్మ అన్నారు. సోమందేపల్లి మండలం నాగినాయన చెరువు గుడిపల్లి తుంగోడు వెలిదడకల నడింపల్లి పంచాయతీ లోని నాయకులతో మంత్రి సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామాల్లో ఉన్న సమస్యల గురించి ప్రస్తావించారు. గ్రామాల వారిగా ఎలాంటి సమస్యలు ఉన్నాయన్నది ఆరా తీశారు. ఇప్పటికే అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసామని మిగిలిన సమస్యలను ప్రధాన్యత వారిగా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన ముఖ్య నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నీటి ఎద్దడి నివారణ కోసం... ట్యాంక్ నిర్మాణం.

-వేసవి దృశ్య నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు.

-ప్రజా అభిప్రాయం మేరకు నీటి ట్యాంకు ఏర్పాటు.

-వార్డులో నీటి సమస్య రాకుండా చూడాలని పరిటాల శ్రీరామ్ ఆదేశాలు.

-హర్షం వ్యక్తం చేసిన ప్రజలు... పరిటాల శ్రీరామ్ కు...

వార్డ్ ఇంచార్జ్ అశోక్ కి ప్రత్యేక కృతజ్ఞతలు.



ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణంలోని 40 వ వార్డు నందు గుట్ట కింద పల్లి లో వేసవి దృశ్య నీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక ట్యాంక్ ఏర్పాటు చేశామని 40 వ వార్డ్ ఇంచార్జ్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.... ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ చింతల పల్లి మహేష్, సీనియర్ టిడిపి నాయకులు కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ ఆదేశాల మేరకు గుట్ట కింద పల్లి లో ప్రజా అభిప్రాయం మేరకు వేసవిలో నీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, ఈ సమస్యను పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన వార్డులో ఎలాంటి నీటి కొరత ఉండకుండా చూడాలని, ప్రజల అభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకొని నివారణ చర్యలు గైకొనాలని ఆదేశించారు. శ్రీరామ్ ఆదేశాల మేరకు సొంత నిధులతో వార్డు నందు ప్రత్యేకంగా నీటి ట్యాంకు నిర్మాణం చేపట్టామన్నారు. 40 వ వార్డులో ఎక్కడా నీటి సమస్య ఉత్పన్నం కాకుండా నీటి నివారణ చర్యలు తీసుకుంటామని, ప్రజా అభిప్రాయానికి కట్టుబడి నీటి ట్యాంకు ఏర్పాటు చేశామన్నారు. ట్యాంక్ నిర్మాణం ఏర్పాటుతో వార్డు ప్రజలు పరిటాల శ్రీరామ్ కు వార్డు ఇంచార్జ్ అశోక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, జనసేన నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ముస్లిం కుటుంబాలకు పట్టు చీరలు...

# నిత్యవసర సరుకుల పంపిణీ.

-హలీమాకుటుంబానికి రంజాన్ తోఫా.

-నగదుఅందజేస్తున్న జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి

చిలకం మధుసూదన్ రెడ్డి, అహుడాచైర్మన్ టీసీవరుణ్.



ధర్మవరం, : మండల పరిధిలోని గొట్లూరు గ్రామానికి చెం దిన హలీమా కుటుంబానికి జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా పంపించిన రంజాన్తో తోఫా, పట్టుచీర, రూ.25వేల నగదు చిలకంమధుసూదన్ రెడ్డి, అహుడాచైర్మన్ టీసీవరుణ్న్ అందజేశారు. అనంతరం హలీమా కుటుంబానికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి పార్టీ ఎల్లప్పుడు అం డగా ఉంటుందని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మత్యకార విభాగపు రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెస్తశ్రీనివాసులు, జనసేనపట్టణ అధ్యక్షుడు అడ్డగిరి శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లు ఎమ్మెల్యే, ఎంపీగా చేశారు.. కనీస విజ్ఞత ఉందా

ఒక మనిషి చావును అడ్డం పెట్టుకుని

కుల రాజకీయాలు చేస్తారా

ప్రకాష్ రెడ్డి, గోరంట్ల మాధవ్ పై

పరిటాల సునీత ఆగ్రహం

పాపిరెడ్డిపల్లి ఘటనలో ఒక వ్యక్తి

చనిపోవడం బాధాకరం

ఆ కుటుంబానికి సాయం చేసేందుకు

ముందుకురండి..నేను వస్తాను

ఘటన జరిగిన వెంటనే పోలీసులు

దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేశారు

పరిటాల పేరు వాడితేనే

మీకు రాజకీయ భవిష్యత్ ఉంటుందా



రాప్తాడు : ఐదేళ్లు ఎమ్మెల్యే, ఎంపీగా పని చేసిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, గోరంట్ల మాధవ్ కనీస విజ్ఞత లేకుండా వ్యవహరిస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి ఘటనలో తమ కుటుంబంపై చేస్తున్న ఆరోపణల మీద ఆమె తీవ్రంగా స్పందించారు. పాపిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన సంఘటన బాధాకరమని.. ఒక వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం ఎంత బాధపడుతుందో అది మాకు బాగా తెలుసన్నారు. గతంలో నా భర్త, మామ, పరిటాల హరిని కోల్పోయి ఎంత బాధ పడ్డామో మాకు తెలుసన్నారు. గ్రామంలో ఉగాది పండుగ రోజు జరిగిన ఒక సంఘటనతో ఆవేశంలో ఆయన పై జరిగిన దాడిలో బ్రెయిన్ డెడ్ తో చనిపోయాడన్నారు. ఇక్కడ చనిపోవాలని దాడి చేసిన సంఘటన కాదని.. రాజకీయాలకు, పార్టీలు, కులాలకు అసలు సంబంధమే లేదన్నారు. దీనిని అడ్డం పెట్టుకుని పరిటాల కుటుంబాన్ని టార్గెట్ చేశారన్నారు. చనిపోయిన వ్యక్తి ఇంటి పేరు వదిలేసి కురుబ లింగమయ్య అంటూ ఆ కులాన్ని రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో ప్రకాష్ రెడ్డి ఆత్మకూరులో ఒక వ్యక్తి తన వ్యక్తిగత కారణాలతో హత్యకు గురైతే.. దాన్ని కూడా మాపై నెట్టారన్నారు. గత 15ఏళ్లుగా కులాల్ని అడ్డం పెట్టుకుని నువ్వు రాజకీయాలు చేయడం అంతా చూశారన్నారు. రాప్తాడులో సీటు కోసం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గొడవలు పడుతూ.. ప్రతిదీ మాకు ఆపాదిస్తున్నారన్నారు. పరిటాల కుటుంబం పేరు చెబితేనే పెద్ద సైకో దృష్టిలో పడుతామన్న ధ్యాస తప్ప వారికి వేరే లేదన్నారు. వారి పార్టీలో ఏం చేసుకున్నా ఫర్వాలేదు కానీ.. మా కుటుంబానికి, పార్టీకి ప్రతిదీ అంటగట్టడం సరైంది కాదన్నారు. కక్షసాధింపులు అంటూ ప్రతిసారి విమర్శలు చేస్తున్నారని.. మీరు గత ఐదేళ్లలో చేసిన దాన్ని మనసులో పెట్టుకుని ఇప్పుడు అలా చేసి ఉంటే.. మీరు ఒక్క రోజు కూడా తట్టుకుని ఉండేవారా అని ప్రశ్నించారు. మీ అన్న మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని, మా మంత్రి లోకేష్ ను ఎంతగా పచ్చిబూతులు తిట్టాడని దాని పై మేము కక్ష సాధించాలనుకుంటే ఏమయ్యేవారో చూసుకోవాలన్నారు. కురుబలు, బోయలు మా కుటుంబ సభ్యుల్లాంటి వారని.. కులాలతో రాజకీయాలు చేయాల్సిన ఖర్మ మీలాగా మాకు పట్టలేదని పరిటాల సునీత స్పష్టం చేశారు. పాపిరెడ్డిపల్లి ఘటనలో తప్పు ఎవరిదైనా సరే.. మా బంధువులని మేము వెనుకేసుకుని రాలేదని.. ఇప్పటికే ఒకర్ని అరెస్ట్ చేశారన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు రాకుండా.. శవ, కుల రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఆ కుటుంబానికి సాయం చేసేందుకు మేము కూడా సిద్ధంగా ఉన్నామని పరిటాల సునీత అన్నారు...

# ఒంటిమిట్ట శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల పనుల పరిశీలన





కడప : ఒంటిమిట్ట ఏకశిలానగరంలో ఏప్రిల్ 05 నుండి ఏప్రిల్ 15 వరకు జరుగనున్న శ్రీ కోదండరామ స్వామి ఆలయం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల పనులను టిటిడి జేఈవో వి వీరబ్రహ్మం పరిశీలించారు.వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ డా.చెరుకూరి శ్రీధర్, ఎస్పీ ఈ జీ అశోక్ కుమార్ లతో కలసి సోమవారం కళ్యాణ వేదిక ప్రాంగణాన్ని టిటిడి జేఈవో పరిశీలించారు.ఈ సందర్భంగా జేఈవో వి. వీరబ్రహ్మం అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా కళ్యాణ వేదిక ప్రాంగణానికి చేరిన జేఈవో ఏప్రిల్ 11న జరుగనున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కళ్యాణ వేదిక పక్కన ఉన్న పీఏసీ బిల్డింగ్ పనులను పరిశీలించారు.ఏప్రిల్ 11వ తేదీన ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు కడప ఎయిర్ పోర్ట్ నుండి ఒంటిమిట్ట కల్యాణ వేదిక ప్రాంగణానికి చేరుకోనున్న నేపథ్యంలో గౌరవ ముఖ్యమంత్రివర్యులు రానున్న మార్గాలలో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో చర్చించారు. బాకారాపేటలో పార్కింగ్ రోడ్ డైవర్షన్ మార్గాలను, భక్తులు ప్రవేశించే, నిష్క్రమణ మార్గాల్లో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ముందస్తుగా ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్యాలరీలలో భక్తులకు త్రాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, సీతారాముల కళ్యాణం ముత్యపు తలంబ్రాలు ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ల ఏర్పాటు, అత్యవసర పరిస్థితుల్లో గ్యాలరీల నుండి బయటకు వచ్చేలా అత్యవసర మార్గాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద పెండింగ్ పనులు, మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, దాదాపు 2 వేల మంది పోలీసు సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎలాంటి తొక్కిసలాటలకు అవకాశం లేకుండా క్షేత్ర స్థాయిలో పటిష్టంగా ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. కల్యాణ వేదిక ప్రాంతంలో జిల్లా కలెక్టర్ ఇచ్చిన పలు సూచనలకు తగ్గట్లుగా అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక, పోలీసు, అన్నప్రసాదాలు పంపిణీకి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని జేఈవో సూచించారు. అనంతరం పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ, పోలీసు, టిటిడి అధికారుల సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో టిటిడి సీఈ సత్యనారాయణ, ఎస్ ఈలు వేంకటేశ్వర్లు, మనోహర్, కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, జమ్మలమడుగు ఆర్డీవో శ్రీమతి సాయి శ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నిమ్మకాయ పరమాణంలో ఉన్న కణతికి శాస్త్ర చికిత్స

# నిర్వహించిన ఫోర్టిస్ ఆస్పత్రి నిపుణులు



అనంతపురం : అనంతపురం నుంచి వచ్చిన 54 ఏళ్ల వ్యక్తికి బెంగళూరు బన్నేరుఘట్ట రోడ్డు ఫోర్టిస్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. నిమ్మకాయ పరిమాణంలో ఉన్న కణితిని తొలగించేందుకు సంక్లిష్టమైన శస్త్రచికిత్సను నిపుణులు చేశారు. వైద్య పరీక్షల్లో అతనికి పాట్స్ పఫ్ఫీ ట్యూమర్ ఉన్నట్లు నిర్ధారణ కాగా,ఇది ఫ్రంటల్ సైనస్ ఇన్ఫెక్షన్‌తో కూడిన అరుదైన,తప్పనిసరిగా శస్త్ర చికిత్స నిర్వహించవలసిన పరిస్థితి..బెంగళూరు బన్నేరుఘట్ట రోడ్డులోని ఫోర్టిస్ ఆసుపత్రిలోని కోక్లియర్ ఇంప్లాంట్,స్కల్ బేస్ సర్జన్, సీనియర్ కన్సల్టెంట్ ఇఎన్‌టి వైద్యుడు డాక్టర్ సుషీన్ దత్,బన్నేరుఘట్ట రోడ్డు ఫోర్టిస్ ఆసుపత్రిలో ఓటోరినోలారిన్జాలజీ కన్సల్టెంట్ డాక్టర్ అభిషేక్ ఎస్ నేతృత్వంలోని వైద్య నిపుణులు ఆయనకు సంక్లిష్టమైన శస్త్రచికిత్సను చేశారు. ఐదు రోజులు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి అనంతరం ఆయన డిశ్చార్జ్ అయ్యారు.అనంతపురానికి చెందిన షామ్ (అసలు పేరు కాదు) అనే రోగి నుదిటిపై వేగంగా పెరుగుతున్న,చాలా బాధాకరమైన వాపును ఎదుర్కొన్నారు.అది కేవలం మూడున్నర వారాలలోనే నిమ్మకాయ పరిమాణంలోకి విస్తరించింది. మొదట్లో, అతని కనుబొమ్మల మధ్య క్రమంగా వాపు రావడాన్ని అతను గమనించారు. అది త్వరలోనే తీవ్రమైన నొప్పిని,బాధను కల్పించింది.వాపు నానాటికీ పెరిగిపోతుండడంపై ఆయన ఆందోళన చెందారు. తన స్వస్థలంలోని వైద్యం చేయించుకునేందుకు ప్రయత్నించారు. స్థానిక వైద్యుల కన్సల్టేషన్,వైద్య పరీక్షల అనంతరం, అధునాతన చికిత్స కోసం ఆయనను బెంగళూరులోని ఫోర్టిస్ ఆసుపత్రికి పంపించారు. ఫోర్టిస్ ఆసుపత్రికి చేరుకున్న తర్వాత,ఇన్ఫెక్షన్ మెదడుకు వ్యాపించిందో లేదో నిర్ధారించేందుకు మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్ (ఎంఆర్ఐ )తో సహా సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. నుదిటిలో ఉన్న సైనస్,ఫ్రంటల్ సైనస్ వెనుక గోడకు వ్యతిరేకంగా వాపు ఉబ్బి ఉన్నట్లు వైద్య పరీక్షల ఫలితాల్లో తేటతెల్లమైంది. ఇన్ఫెక్షన్ ఇంకా మెదడుకు చేరుకోలేదని,సైనస్ ఫ్రంటల్ లోబ్‌కు దగ్గరగా ఉండటంతో ఇది గణనీయమైన ప్రమాదాన్ని కలిగిస్తుందని వైద్యులు గుర్తించారు. కేసు తీవ్రతను అర్థం చేసుకుని,డాక్టర్ సుషీన్ కచ్చితమైన చికిత్సను,సమస్యను ప్రభావవంతంగా పరిష్కరించేందుకు శస్త్రచికిత్సా విధానాన్ని సిఫార్సు చేశారు.ఈ కేసు వివరాలను బెంగళూరులోని బన్నేరుఘట్ట రోడ్డు ఫోర్టిస్ హాస్పిటల్‌లోని సీనియర్ కన్సల్టెంట్ ఇఎన్‌టి, కోక్లియర్ ఇంప్లాంట్, స్కల్ బేస్ సర్జన్ డాక్టర్ సుషీన్ దత్ వివరిస్తూ, “మేము మిశ్రమ విధానాన్ని (ఓపెన్ మరియు ఎండోస్కోపిక్) ఎంచుకున్నాము. నుదిటి పైన కచ్చితమైన కోతతో మెరుగైన యాక్సెస్‌ను పొందేందుకు,ఇన్‌ఫెక్షన్ కణజాలాన్ని పూర్తిగా తొలగించవలసిన ఉంటుందని మేము నిర్ధారించుకున్నాము.మెదడు నుంచి సైనస్‌ను వేరు చేసే కణజాలం పలుచని పొరను ఇన్ఫెక్షన్ చీల్చకుండా చూసుకోవాలి.మెదడును కాపాడుతూనే ఇన్ఫెక్షన్‌ను క్లియర్ చేసేందుకు మేము చాలా జాగ్రత్తగా పనిచేశాము” అని వివరించారు. బెంగళూరులోని ఫోర్టిస్ హాస్పిటల్స్ బిజినెస్ హెడ్ అక్షయ్ ఓలేటి మాట్లాడుతూ, “ఫోర్టిస్ ఆసుపత్రిలో, వినూత్న చికిత్సలు, వ్యక్తిగతీకరించిన రోగి సేవల ద్వారా అత్యున్నత ప్రమాణాల సంరక్షణను అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాము. ఈ కేసు విజయవంతమైన ఫలితం,అధునాతన సాంకేతికత,నిపుణుల క్లినికల్ జోక్యంతో సంక్లిష్ట వైద్య పరిస్థితులను పరిష్కరించడంలో మా అంకితభావాన్ని హైలైట్ చేస్తుంది.మా రోగులు వారి కోలుకునే ప్రయాణంలో మద్దతు ఇవ్వడం,ఆరోగ్య సంరక్షణ శ్రేష్ఠతలో స్థాయిని పెంచడం కొనసాగించడం మాకు గర్వకారణం” అని తెలిపారు.

## పవిత్ర రంజాన్ మాసంలో

# నిబద్ధతతో ఉపవాసాలు.

-ధర్మవరం ఈద్గా మైదానంలో ముస్లీం లతో కలిసి ప్రార్ధనలో

పాల్గొన్న పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్ రెడ్డి.

-ప్రతి ముస్లీం ఆర్థికంగా, సామాజికంగా బాగుండాలన్నదే ప్రభుత్వ ప్రయత్నం

-ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్, చిలకం మధు.



ధర్మవరం, : ప్రతి ముస్లీం కుటుంబం ఆర్థికంగా, సామాజికం గాబాగుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ధర్మవరం నియోజకవర్గటీడీపీ ఇన్చార్జ్పరిటాలశ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రదానకార్యదర్శిచిలకం మధుసూదన్రెడ్డిలు పేర్కొన్నారు. రంజాన్సందర్భంగాపట్టణంలోని ఈద్గామైదానం లోజరిగిన సామూహిక ప్రార్థనలో వారు పాల్గొన్నారు. మతపెద్దలసందేశాన్ని వారు విన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పవిత్రమైన రంజాన్ మాసంలో నిబద్ధతతో నెలరోజులపాటు ఉపవాసదీక్షలు చేస్తూ నియమనిష్టలతో గడిపారన్నారు. పవిత్రంగా జరుపుకునే ఈద్ అని పేర్కొన్నారు. సహనం, త్యాగం, జాలి, దయ, సేవా గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వం ముస్లిం మైనార్టీల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోందన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్. నరేంద్ర చౌదరి, ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, ముస్లిం సోదరులు నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, అత్తర్ రహీం భాష, అస్లాం, రావులచెరువు కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ సీనియర్ హాకీ

# జట్టుకు ఎంపికైన క్రీడాకారులు.

ఏప్రిల్ 4వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు పురుషుల జాతీయ సీనియర్ హాకీ పోటీలు.

జాతీయ సీనియర్ కీ పోటీలకు దర్మవరం క్రీడాకారుల ఎంపిక.



ధర్మవరం రూరల్ : జాతీయ సీనియర్ హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్టు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్ బంధనాధం సూర్యప్రకాశ్ తెలిపారు. ఈనెల 15న గుంటూరులో జరిగిన 15వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ పోటీలలో. సత్యసాయిజిల్లా జట్టు ప్రతిభ కనబరచి రెం డస్థానం సాధించింది. అందులో ప్రతిభ కనబరచిన ధర్మవరం క్రీడాకారులు ప్రశాంత్, లోకేశ్ లు రాష్ట్ర జట్టులో స్థానం సాదించారన్నారు. ఎంపికైన ఈ ఇద్దరు క్రీడాకారులు ఏప్రిల్ 4వతేదీ నుంచి 15వతేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఝాన్సీ నగరంలో జరిగే 15వ పురుషుల జాతీయ సీనియర్ హాకీ పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఆదివారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్ బంధనాధం సూర్య ప్రకాష్ హాకీ అసోషియేషన్ సత్యసాయిజిల్లా గౌరవాధ్యక్షులు బండి వేణుగోపాల్, పళ్లెం వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు బి.వి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఉడుముల రామచంద్ర, గౌరీ ప్రసాద్, ఊకా రాఘవేంద్ర, మహమ్మద్ అస్లాం, కోశాధికారి అంజన్న, జాయింట్ సెక్రెటరీ అరవింద్ గౌడ్, చంద్రశేఖర్, డైరెక్టర్లు మారుతి, ఇర్షాద్, అమునుద్దీన్, కిరణ్, శ్రీ సత్య సాయి జిల్లా హాకీ కోచ్ హసేన్ తదితరులు అభినందించారు.

## ధర్మవరం,వినాయక కూచిపూడి నృత్యాలయం కు ఐదు స్వర్ణ మంజరి అవార్డులు.



ధర్మవరం : శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలో నిర్వహిస్తున్న టువంటి వినాయక కూచిపూడి నృత్యాలయం,కు గురువు శ్రీలేఖ స్వర్ణ గిరీశ్వర, విద్యార్థులకు "స్వర్ణ మంజరి" అవార్డులు వరించాయి. శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళానృత్య సంస్కృతి సంస్థ వారు, ఈనెల 29-శనివారం రోజున,స్వర్ణగిరి వెంకటేశ్వర దేవస్థానం భువనగిరి హైదరాబాద్ లో నిర్వహించిన, శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది పురస్కారాలు భాగంగా ధర్మవరం పట్టణానికి చెందిని వినాయక కూచిపూడి నృత్యాలయం ధర్మవరం కు చెందిన స్టూడెంట్స్ కు,సునీత, అమృత,హేమావతి, నవ్యశ్రీ, వన్యశ్రీ, లకు ఐదు అవార్డులు రావడం జరిగిందని, గురువు శ్రీలేఖ తెలిపారు. ఈ సందర్భంగా నృత్య కళాకారులకు గురువుతో పాటు తల్లిదండ్రులు, కళాకారుల అభిమానులు కుటుంబ సభ్యులు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రతి ముస్లిం ఆర్థికంగా, సామాజికంగా బాగుండాలన్నదే ప్రభుత్వ ప్రయత్నం.. ధర్మవరం నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్,

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకం మధుసూదన్ రెడ్డి.




ధర్మవరం : శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం ప్రతి ముస్లిం కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా బాగుండాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రంజాన్ పండుగలో భాగంగా ధర్మవరం పట్టణంలోని ఈద్గా మైదానంలో జరిగిన సామూహిక ప్రార్థనల్లో వారు ఇరువురు పాల్గొన్నారు. మత పెద్దల సందేశాన్ని ఆయన విన్నారు. అనంతరం ముస్లిం సోదరులను పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్ రెడ్డి ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరిటాల శ్రీరామ్ చిలకం మధుసూదన్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్? మాసంలో నిబద్ధతతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేస్తూ నియమ నిష్ఠలతో గడిపారన్నారు. నెల రోజులు ఎంతో నిష్ఠతో ఉపవాసాలు ఉండి ఆకలిదప్పుల విలువ తెలుసుకొని పవిత్రంగా జరుపుకునే ఈద్ ఇదని పేర్కొన్నారు. సహనం, త్యాగం, జాలి, దయ, సేవాగుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలనే దృఢ సంకల్పంతో పిల్లలు, యువతకు దిశా నిర్దేశం చేసిన మాసం ఇది అన్నారు.



మహమ్మద్ ప్రవక్త ఆదేశానుసారం అనాది నుంచి నేటి వరకు ఫిత్రా పేరిట ఆహారం, వస్త్రాలు, నగదు రూపంలో పేదలకు సాయం చేస్తూ వస్తోన్న సంప్రదాయం ఎంతో గొప్పదన్నారు. ప్రభుత్వం ముస్లిం మైనార్టీల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోందన్నారు. వారు ఆర్థికంగా ఎదిగే విధంగా ప్రోత్సాహకాలు అందిస్తోందని వారు అన్నారు. వందలాది మంది ముస్లిం సోదరులు పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలోని సమీపంలో గల ఈద్గా మైదానంలో రంజాన్ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. ముస్లిం మత పెద్దలు సోదరులు ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్దకు పెద్ద ఎత్తున ముస్లింలు హాజరై ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముత్వల్లి అందరితో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. తదుపరి ఒకరినొకరు ఈద్ ముబారక్ అంటూ ముస్లిం సోదరులు పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారుల సైతం ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకోవడం అందరినీ ఆకట్టుకుంది.

## విరాళాలు, నిత్యావసర సరుకులు ఇంటింటా సేకరణతో కళ్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహణ. శ్రీ కోదండ రామస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ.



ధర్మవరం : శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని రామ్ నగర్ కొత్తపేట లో వెలసిన శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో ఈనెల నాలుగవ తేదీ నుండి ఆరవ తేదీ వరకు శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహించుట లో భాగంగా ఇంటింటా విరాళము, నిత్యావసర సరుకులను ప్రజలను భాగస్వాములతో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పామిశెట్టి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు చందా రామాంజనేయులు, పూజారి ఆదినారాయణ, కార్యదర్శి రంగన్న వెంకట రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ తోపాటు సభ్యులు, భక్తాదులు, రాంనగర్, కొత్తపేట, కాలనీ ప్రజలు అందరూ ఇంటింటా కుటుంబాల వద్దకు ప్రజలు ఇచ్చిన నగదు, నిత్యావసర సరుకులను విరాళాలుగా తీసుకోవడం జరుగుతోందని తెలిపారు. గత 26 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఆలయ 26వ వార్షికోత్సవమును కూడా ఘనంగా నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలు 4వ తేదీన ప్రజారోహణం, 5వ తేదీన ఎదురుకోళ్ల కార్యక్రమం, 6వ తేదీన కళ్యాణం తో పాటు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ఆలయం 30/4/98 వ తేదీన శంకుస్థాపన, 25/4/99 వ తేదీన విగ్రహ ప్రతిష్ట, కల్యాణోత్సవం జరిగిందని తెలిపారు కళ్యాణోత్సవ వేడుకలకు రూ.25,000 లనుండి 100 రూపాయల వరకు విరాళాలు సేకరించడం జరిగిందన్నారు. భక్తాదులు కూడా బెల్లము, బియ్యము, కందిబేలు, శనగబేలు, రవ్వ ,పామాయిల్, పాలు, పెరుగు తదితర నిత్యావసర సరుకులు వారి శక్తి కొలది ఇవ్వడం జరిగిందన్నారు. దాతలు, భక్తాదులు, ఎవరైనా సరే కళ్యాణ మహోత్సవ వేడుకలకు తమకు తోచిన సరుకులు గాని నగదు కానీ ఈనెల ఆరవ తేదీ వరకు ఇవ్వవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు పూజారి లక్ష్మీనారాయణ, పామిశెట్టి చిన్న శ్రీనివాసులు, హరి, రాము, కోశాధికారి రాముడు సహాయ కోశాధికారి హరికృష్ణ, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, గౌరవ సలహా మండలి, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తాదులు పాల్గొన్నారు.ఽ

## జిల్లా కలెక్టర్ చేతన్ చే అభినందనలు అందుకున్న మానస నృత్య కళా కేంద్రం.



పుట్టపర్తి : శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి లో ఉగాది పండుగ సందర్భంగా ధర్మవరం పట్టణానికి చెందిన మానస నృత్య కళా కేంద్రం వారు ప్రదర్శించిన ప్రత్యేక నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆ ప్రదర్శన చూచిన జిల్లా కలెక్టర్ చేతన్ ప్రత్యేకంగా అభినందించారు. తదుపరి కలెక్టర్ చైతన్ మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే మానస చదువుతోపాటు నాట్యం పట్ల ఆసక్తి చూపడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. అంతేకాకుండా తాను నేర్చిన నృత్యాలను చిన్నారులకు నేర్పించి పలుచోట్ల ప్రదర్శనలు ఇవ్వడం ఎంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు. తల్లిదండ్రులు కూడా చదువుతోపాటు నృత్యము, క్రీడలు, కరాటే నేర్పావాలన్నారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా గురువుతో పాటు శిష్య బృందం కు బహుమతులు ప్రధానం చేసి, గురువు మానసను ప్రత్యేకంగా సన్మానించారు. మానస వివిధ చోట్ల నృత్య ప్రదర్శన ఇవ్వడం, మానస ను ప్రోత్సహించిన తల్లిదండ్రులను కూడా కలెక్టర్ అభినందించారు.

# ఆధ్యాత్మిక కేంద్రంగా సంతబొమ్మాళిని తీర్చిదిద్దుతా

తనకెంతో ఇష్టమైన గ్రామం సంతబొమ్మాళి

గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు

ఒకటి రెండు రోజుల్లో కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి రహదారి పనులకు శంకుస్థాపన

నరసన్నపేట నుంచి వెంకటాపురం వరకు రూ.120 కోట్లు అంచనాతో అధునాత రహదారి నిర్మాణం





: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నార లోకేష్,కేంద్రం పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపురామ్మోహన్నాయుడు,సహకారంతో అభివృద్ధికి చర్యలు దివంగత మహానేత కింజరాపు ఎర్రన్నాయుడుగారు,ప్రజలు, నాయకులు కార్యకర్తలే,శీస్సులు మెండు గాఉన్నాయని నమ్ముతున్న ఇటువంటి అవకాశం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా సంతబొమ్మాళి మండల కేంద్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చి దిద్దే బాధ్యత తాను తీసుకుంటాని గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు భరోసా ఇచ్చారు. సోమవారం శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు. దివంగత మహానేత కింజరాపు ఎర్రన్నాయుడు గారు,ప్రజలు, నాయకులు, కార్యకర్తలే, ఆశీస్సులు మెండుగా ఉన్నాయని నమ్ముతున్నాని అన్నారు. దివంగత మహానేత నందమూరి తారక రామారావు గారు 1987 మాండలిక వ్యవస్థను తీసుకొచ్చార అన్న విషయాన్ని గుర్తు చేశారు. దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు గారు కృషి ఫలితంగా సంతబొమ్మాళి ని మండల కేంద్రంగా ఏర్పాటు చేశారని తెలిపారు. కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి రహదారి పనులకు ఒకటి రెండు రోజుల్లో



శంకుస్థాపన చేయడం జరుగుతుందని ప్రకటించారు. అదేవిధంగా నరసన్నపేట నుంచి వెంకటాపురం వరకు రూ.120 కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మాణ పనులు అతి త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. టెక్కలి నౌపడ, వడ్డివాడ రైల్వే వంతెన పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, అందుకు అవసరమైన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ను ప్రొత్సహించేందుకు చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగానే నియోజవర్గానికి 10 పదివేల సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయనుందని, ఇందులో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. పారిశ్రామిక హబ్ గా తీర్చిదిద్దేందుకు గాను 10 వేల ఎకరాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నార లోకేష్,కేంద్రం పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, సహకారంతో భివృద్ధి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం జరుగుతుందని, మత్స్యకార భరోసా, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా అతి త్వరలోనే అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా అందరూ సమిష్టిగా ఉండి అభివృద్ధి పథంలో తీసుకువెళ్దామని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ గారు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనంతపురం యువకుడు బిసాతి భరత్ ను అభినందించిన భారత దేశపు 14 వ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ గారు



అనంతపురం : అనంతపురం జిల్లా కు చెందిన బిసాతి భరత్ ను భారత దేశపు 14 వ రాష్ట్రపతి మరియు జమిలి ఎన్నికల కమిటీ చైర్మన్ శ్రీ రామ్ నాథ్ కోవింద్ గారిని డిల్లీ లోని తన యొక్క అధికారిక నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి యొక్క విగ్రహాన్ని ఇవ్వడం జరిగింది. అలాగే గత 12 సంవత్సరాలుగా బిసాతి భరత్ గారు చేసిన సామాజికి సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా గత 12 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు జాతీయ సేవా పథకం వాలంటీర్ నుంచి నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారిగా, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకుడిగా ఎంతో మంది యువతకు వ్యక్తిత్వ వికాసం, మరియు గ్రామాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే డిజిటల్ ఇండియా, మై గవర్నమెంట్, వంటి ఎన్నో రకాల కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన విషయాలను మారూముల గ్రామాలలో యువత కు మరియు ప్రజలకు చేసిన సేవలను అడిగి తెలుసుకున్నారు. బిసాతి భరత్ నిర్వహించిన యూత్ పార్లమెంట్, పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు, జాతీయ యువజన పాలసీ 2021 రూపకల్పన, కేంద్ర ప్రభుత్వ పథకాలు పై అవగాహన కార్యక్రమాలు, వికసిత భారత సంకల్ప యాత్ర, మేరీ మట్టి మేర దేశ, సంకల్ప సిద్ధి, కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, నాయకత్వ లక్షణాలు, లైఫ్ స్కిల్స్ కార్యక్రమాలు గురించి తెలుసుకొని ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అలాగే బిసాతి భరత్ ఆధ్వర్యంలో జమిలి ఎన్నికల పై అన్ని రాజకీయ పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు మరియు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులను కలిసి మిలి ఎన్నికల కి మద్దతుగా సంతకాల సేకరణ చేసినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు . అలాగే రాష్ట్రపతి అవార్డు,మరియు జాతీయ యువ అవార్డు, మైగవ్ అవార్డు, ప్రిన్సెస్ దయానా అవార్డు, ఐక్యరాజ్య సమితి అవార్డు అందుకున్న సందర్భంగా అభినందించారు. అలాగే ఇలాంటి ఎన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ఇంకా ఉన్నత పదవులు స్వీకరించి వికసిత భారత దేశం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగా జాతీయ యువ అవార్డు గ్రహీత శివకుమార్ , విశాలాక్షి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నిలయ అగర్వాల్ పాల్గొన్నారు.

## ఉగాది పండగ సందర్భంగా అంకాలమ్మ తిరుణాలలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ప్రారంభించిన మంత్రి ఎన్ఎండిఫరూక్



గోస్పాడు మండలం : సాంబవర గ్రామంలో ఉగాది పండగ సందర్భంగా గ్రామంలో ప్రతి ఏడు అంగరంగ వైభవంగా జరిగే అంకాలమ్మ తిరుణాలలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలను నిర్వహించడం అనవాతిగా వస్తుంది సాంబవర గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా అంకాలమ్మ తిరుణాలలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్ హాజరై ఎద్దుల బల ప్రదర్శన పోటీలను ప్రారంభించారు అనంతరం గ్రామ సమస్యలపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట డిసి ఛైర్మన్ చాబోలు ఇలియాస్,నంద్యాల జిల్లా ఉర్దూ స్కూల్స్ డిఐ అస్మద్దీన్,సాంబవరం తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదినారాయణ,మాజీ కౌన్సిలర్ మిద్దె హుస్సేన్, జిల్లెల్ల చంద్రశేఖర్ రెడ్డి,గోపాల్ రెడ్డి,తులసిరెడ్డి,చంద్ర, తదితరులు పాల్గొని ఎద్దుల బల ప్రదర్శన పోటీల తిలకించారు అనంతరం మధ్యాహ్నం గ్రామ ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై అంకాలమ్మ తిరుణాలను విజయవంతం చేశారు.

## మోదీ ఉపాధి.. బాబు చేయూత: పురందేశ్వరి



అమరావతి, : 'దేశంలో కోటి మందికి ఉపాధి చూపాలని టాప్ 500 కంపెనీలను ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. రాష్ట్రంలోని పేదలకు ధనికులు చేయూత అందించాలని సీఎం చంద్రబాబు కోరుతున్నారు. ఇది దేశంలోని యువతకు, రాష్ట్రంలోని పేదలకు వరం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లాల నూతన అధ్యక్షులు, ఇన్‌చార్జిలతో సంస్థాగత అంశాలు-రాజకీయ కార్యాచరణపై ఆమె చర్చించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ... 'ఏడాది క్రితం వరకూ రాష్ట్రంలో విద్వేషం, విధ్వంసం మాత్రమే కనిపించేవి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఏపీకి భవిష్యత్తు అగమ్యగోచరంగా కనిపించేది. కానీ డబులింజన్ సర్కార్ వల్ల కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయి. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. రహదారులకు కొత్త రూపు వచ్చింది. మోదీ, బాబు, పవన్ సమన్వయంతో పోలవరం, అమరావతి నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని పార్టీ నేతలకు పురందేశ్వరి దిశా నిర్దేశం చేశారు.

## ముస్లిమ్ సోదరుల అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్

కర్నూలు నగరంలో రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్,జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





కర్నూలు, : ముస్లిమ్ సోదరుల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా నగరం లోని పాత ఈద్గాలో జిల్లా కలెక్టర్, ముస్లిం సోదరులతో కలిసి మంత్రి టీజీ భరత్ ప్రార్థనలు చేశారు..అనంతరం మంత్రి, కలెక్టర్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముస్లిం సోదరులందరూ ఎంతో పవిత్రతతో, భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకుంటున్న పండుగ రంజాన్ అని పేర్కొన్నారు. వర్షాలు బాగా కురిసి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా ఉండేలా దీవించాలని అల్లాహ్ ను ప్రార్థించానని మంత్రి తెలిపారు..నిన్న ఉగాది, నేడు రంజాన్ పండుగలు రావడం సంతోషం అని, కర్నూలు నగరంలో కుల,మతాలకు అతీతంగా అందరూ అన్ని పండుగలను జరుపుకోవడం ఆనవాయితీ అని మంత్రి పేర్కొన్నారు.. ఇలా హిందూ, ముస్లిం భాయీ భాయీ నినాదానికి ప్రతీక కర్నూలు నగరం అని మంత్రి పేర్కొన్నారు.

### త్యాగానికి ప్రతీక రంజాన్: జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





త్యాగానికి ప్రతీక రంజాన్ అని, రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు క్రమశిక్షణ, ధార్మిక చింతన, నియమనిష్టలతో నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో అల్లాహ్ ను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారనిజిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పేర్కొన్నారు.. ఈరోజు రంజాన్ పండుగ జరుపుకుంటున్న సందర్భంగా జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు..

## కేంద్ర ప్రభుత్వం తీరుపై ముస్లింలు నిరసన



గోరంట్ల : వక్ఫ్ బోర్డ్ అమెండ్మెంట్ బిల్లు కి వ్యతి రేకంగా ముస్లింల శాంతియుత నిరసన గోరంట్ల పట్టణం లోని జమియత్ ఉలమా- ఏ హింద్ ఆధ్వర్యంలో అన్ని మసీదులలో శుక్రవారం నమాజు తర్వాత, కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన వక్ఫ్ బోర్డ్ అమెండ్మెంట్ బిల్లు ముస్లిం సమాజానికి చాలా అన్యాయం చేకూర్చేలా ఉన్న ఈ నల్ల చట్టాన్ని వ్యతిరేకిస్తూ గోరంట్ల పట్టణంలోని అన్ని మసీదులలో కుడి చేతికి నల్ల బ్యాడ్జి కట్టుకొని ఈ వక్ఫ్ బోర్డ్ అమెండ్మెంట్ బిల్లు కి వ్యతిరేకంగా ముస్లింలు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి మసీదు యొక్క కమిటీ పెద్దలు, జమియత్ ఉలమా సభ్యులు మత పెద్దలు, యువకులు మరియు గోరంట్ల ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశంలో
## అనధికారిక సభ్యలదే హంగామా



తలుపులు :తలుపులు మండల సర్వసభ్య సమావేశంలో ఆనందికరికా సభ్యలదే హంగామా తలుపుల మండల సర్వసభ్య సమావేశంలో ఒకరి స్థానంలో మరొకరు మండల సర్వసభ్య సమావేశానికి తొంగి చూడని ప్రజా ప్రతినిధులు గై హాజరైన కొంతమంది అధికారులు గతంలో కూడా ఇలాగనే ఒకరి స్థానంలో మరొకరు తీరుమారని ప్రజా ప్రతినిధులు తలుపుల.... జీవనజ్యోతి మండల సమైక్య నందు శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో రామా నాయక్ ఆధ్వర్యంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సర్వసభ్య సమావేశమునకు అధికారులు సాక్షిగా ఒకరి స్థానంలో మరొకరు మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. అంతటితో ఆగకుండా ఒకరి స్థానంలో మరొకరు వచ్చిన వారు సర్వసభ్య సమావేశంలో సమస్యలను పరిష్కరించాలని సంబంధించిన అధికారులను ప్రశ్నించేది విడ్డూరంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.ఈ ధోరణి మారి ఎవరైతే ప్రజా ప్రతినిధులు ఉన్నారో వారి సంపూర్ణ రాజకీయ అధికారాలు హక్కులు పొందేలా చూడాలని మండలంలో పలువురు కోరుతున్నారు..

## గోరంట్ల పంచాయతీ వేలం వాయిదా

గోరంట్ల : గోరంట్ల పంచాయతీ కార్యాలయంలో సారధ్యంలో శనివారం నాడు జరగాల్సిన వేలం పాటను వాయిదా వేసినట్లు కార్యదర్శి సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు వారపు కూరగాయల మార్కెట్ జె ఆర్ వై రూములు. వేలం పాట వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు గోరంట్ల పట్టణంలోని వారపు కూరగాయల మార్కెట్ వేలం పాటలను ఏప్రిల్ 3 వ తేదీ కు వాయిదా వేసినట్లు మేజర్ పంచాయతీ ఈవో సుబ్రహ్మణ్యం మీడియాకు తెలిపారు,వారపు కూరగాయల మార్కెట్ తో పాటు పంచాయతీ రూములు, స్టాండ్ ఫీజు వేలం పాటలు సైతం వాయిదా పడినట్లు తెలిపారు.

## ఈ -శ్రమ్ ఎక్స్ గ్రేషియా క్లైములు
## ఈనెల 31 వరకు గడువు
### సహాయ కార్మిక కమిషనర్




పుట్టపర్తి, : కేంద్ర ఉపాధి కార్మిక శాఖ ఆదేశాల మేరకు అసంఘటిత రంగ కార్మికులు జాతీయ డేటా బేస్ ఈ -శ్రమ్ పోర్టల్ లోని ఎక్స్ గ్రేషియా క్లైములు ఈనెల 31 వరకు గడువు పొడిగించడం జరిగింది.ఈ -శ్రమ్ గుర్తింపు కార్డు కలిగి ఉండాలి 31.3.2022 లోపల ప్రమాదవశాత్తు మరణించిన .ఈ -శ్రమ్ కార్డు గల అసంఘటిత రంగ కార్మికుల నా మినీదారులు పిడి డిఆర్డిఏ కార్యాలయం పుట్టపర్తి నందు ప్రాసెస్ చేయవలసిందిగా సూచించడం అయినది. ఇందుకు సంబంధించిన సందేహాలు ఏమైనా ఉంటే సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయం నందు సంప్రదించవచ్చునని శ్రీ సత్య సాయి జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్రీ సూర్యనారాయణ పై ప్రకటనలో తెలిపారు ఫోన్ నెంబర్ 9100825189 సంప్రదించవచ్చు.

## విశ్వకర్మ పనిముట్లు పంపిణీ




గోరంట్ల : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకం పనిముట్లు బిజెపి జిల్లా అధ్యక్షుడు జియం శేఖర్ ఆదేశాలు మేరకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యువజన పథకం ద్వారా 18 కుల కుల వృత్తి వారికి చేయూతనివ్వడానికి వారు ఆర్థికంగా బలపడడానికి దోవదపడుతున్న పథకం విశ్వకర్మ యోజన ద్వారా చేతి వృత్తుల వారికి భరోసాగా ఆర్థికంగా లబ్ది చేకూరుతుందని బిజెపి నాయకులు పేర్కొన్నారు పనిముట్లు మరియు ఆర్థిక చేయూతనివ్వడానికి బ్యాంకు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు, జియం శేఖర్ నాయకత్వంలో గోరంట్ల మండలంలోని మేదర కులస్తులకు చేతి వృత్తి లబ్ధిదారులైన మేదర వెంకటలక్ష్మికి విశ్వకర్మ పనిముట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ,స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకొని,
# ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలి. సిపిఎం.



పుట్టపర్తి : రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పుట్టపర్తి తాసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపు స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ఇంధన సర్దుబాటు, ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రెండుసార్లు విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై వేసిందని. ఈ భారానికి గత ప్రభుత్వం కారణమని సాకులు చెబుతుందని ప్రతిపక్షంలో వున్నప్పుడు సర్దుబాటు చార్జీలను తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం, జనసేన నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని కొనసాగిస్తుందని ప్రతి యూనిట్కు నెలకు రూ.1.46 నుండి రూ.1.65 అదనంగా చెల్లించాల్సి వస్తుందని 2024-25 సంవత్సరానికి సంబంధించి మరోసారి సర్దుబాటు చార్జీల భారం వేయడానికి ప్రతిపాదనలు సిద్ధంగా వున్నట్లు వార్తలు వస్తున్నాయ న్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సారాల్లో వేల కోట్ల భారం వేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వ వినాశకర విద్యుత్ విధానాన్ని అమలు చేసింది. అందులో భాగంగా స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆదాని కంపెనీ ప్రయోజనాల కోసం సెక్ సంస్థతో చేసుకున్న ఒప్పందాలు రాష్ట్ర ప్రజలపై నిరంతరం విద్యుత్ భారాలు వేసే విధంగా వున్నాయి. వీటిని ప్రతిపక్షంలో వున్నప్పుడు ప్రశ్నించడమే కాకుండా స్మార్ట్ మీటర్లను పగులగొట్టమని తెలుగుదేశం నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాలు మరింత వేగంగా అమలు చేస్తున్నారు. వీటిని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. పెరిగిన విద్యుత్ భారాలను ప్రజలేకాదు, పరిశ్రమలు కూడా భరించే పరిస్థితిలేదు. హిందూపురంలో 42 సంవత్సరాలుగా నడుస్తున్న ఫ్రీకాట్ బి మిల్లు పెరిగిన విద్యుత్ చార్జీల వల్ల మూతబడిందన్నారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీంలో భాగంగా వైఎస్ జగన్ సర్కారు విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగించడానికి నిర్ణయించింది. ఆ టెండర్లు కూడా షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి అప్పగించింది. దీనిపై ప్రస్తుత రాష్ట్ర ఆర్థికమంత్రి, మరో శాసనసభ్యుడు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేశారు. ఇప్పుడు మాత్రం అదే విధానాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో 1.90కోట్ల మంది విద్యుత్ వినియోగదారులున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, పరిశ్రమ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు ప్రీ పెయిడ్ మీటర్లను బిగిస్తున్నారు. త్వరలోనే 200 యూనిట్లు దాటిన గృహ వినియోగదారులకు కూడా ఈ మీటర్లను అమర్చనున్నారు. ఈ కొత్త మీటర్ల ధరను కూడా ప్రజలే భరించాలి. ఒకవైపు సర్దుబాటు, ట్రూ ఆఫ్ చార్జీలు మరోవైపు స్మార్ట్ మీటర్ల అదనపు భారం ప్రజలపై వేయడాన్ని తక్షణం ఉ పసంహరించకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీకి అనుగుణంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరించకోవాలి, వినాశకరమైన సెకి ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు ఉపసంహరించిన యెడల రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలను ఉధృతం చేస్తామన్న హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి బ్యాల్ల అంజి, గంగాధర్, జిల్లా కోశాధికారి వెంకటేష్, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎంపీపీ ఉప సర్పంచ్ ఎన్నికలు..



పుట్టపర్తి : అడుగడుగునా భద్రత .. జిల్లా ఎస్పీ వి.రత్న ఐపీఎస్ పర్యవేక్షణ .. ఎన్నికలు ముగిసేవరకు .. అవిశ్రాంతంగా 'ఖాకీ'ల విధులు.. శ్రీ సత్య సాయి జిల్లాలో జరిగిన ఎంపీపీ ఉపసర్పంచ్ స్థానాల ఎన్నికలు పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. గత నాలుగు రోజులుగా జిల్లా ఎస్పీ శ్రీమతి వి.రత్న ఐపీఎస్ గారు ఈ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీ ప్రణాళికతో బందోబస్తు నిర్వహించేలా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. రామగిరి, రొద్దం, గాండ్లపెంట, ఎంపీపీ స్థానాలు, పెనుగొండ మడకశిర నియోజకవర్గంలోని రాంపురం కల్లుమర్రి ఉపసర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి, అయితే రామగిరి గాండ్లపెంట ఎంపీపీ స్థానాలు ఎన్నిక వాయిదా పడింది. ఎన్నికల ప్రారంభమైనప్పటినుంచి ముగిసే దాకా జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో



ధర్మవరం కదిరి డిఎస్పీలు హేమంత్ కుమార్, శివన్నారాయణ ఆధ్వర్యంలో అడుగడుగునా భద్రతను పెంపొందించేలా పోలీసు సిబ్బందికి సూచనలిస్తూ ఎలాంటి సంఘటన జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎంపీపీ ఎంపిక ఒకరోజు ముందే రామగిరి ప్రాంతాలను పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాట్లపై సూచనలు చేశారు. డి.ఎస్.పిలు, సిఐలు , ఎస్సైలు, ప్రత్యేక పోలీసు బలగాలతో, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. పోలీసు సిబ్బంది విధుల గురించి ముందే అధికారులకు జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేయడంతో శుక్రవారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన డ్రోన్, సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టి పరిసరాలను పోలీసులు జల్లెడ పట్టారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా శాంతంగా ఎన్నికలు జరిగే విధంగా పోలీసులు అంకిత భావంతో విధులు నిర్వర్తించడం పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# అమెరికాలో మకార్తీ భూతం మళ్లీనా?

గతం గుర్తుకు రాని మనిషీ ఉండదు, సమాజమూ ఉండదు. వర్తమానంలోని బాధలను గతంలోని కష్టాలతో పోల్చి చూసుకోవటం నిరంతరం సాగుతూనే ఉంటుంది. మూడో ప్రపంచ యుద్ధం వస్తుందనే భయం రెండో ప్రపంచ యుద్ధంనాటి బీభత్సాన్నీ విధ్వంసాన్నీ ఎంతో కొంత తెలుసుకునేలా ప్రేరేపిస్తుంది. ప్రభుత్వాలు భావప్రకటనా స్వేచ్ఛనూ, అసమ్మతినీ అణచివేస్తున్న ప్రతి సందర్భంలోనూ బాధితులు గతంలో తమలాంటి వారినీ అప్పటి ప్రభుత్వాల దాష్టీకాలనూ గుర్తుకు తెచ్చుకోకమానరు. అందుకోసం చరిత్రను తవ్వకుండా ఉండనూ లేరు. అసమ్మతిని సహించలేని ధోరణి హద్దులు దాటినప్పుడు బాధితులతో పాటు ఆలోచనాపరులు కూడా గతంలోని దారుణాలపై దృష్టి సారించకుండా ఉండలేరు. అమెరికాలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు అలాంటి అవసరాన్ని కలిగిస్తున్నాయనే చెప్పుకోవాలి. విద్యాసంస్థలను రాడికల్ వామపక్షవాదుల ప్రభావం నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎన్నికల్లో గెలిచిన తర్వాత చాలా కటువుగా, మొరటుగా చెప్పారు. 'మార్క్సిస్ట్స్, మేనియాక్స్, లూనటిక్స్'లు విద్యా సంస్థలను శాసిస్తున్నారనీ విమర్శించారు. దీన్ని చూస్తూ ఊరుకుంటున్న ఉన్నతాధికారులను ఉద్యోగాల నుంచి తొలగిస్తాననీ ప్రకటించారు. చెప్పినట్లుగానే ఫెడరల్ విద్యాశాఖను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులనూ జారీచేశారు. విద్యాసంస్థలకే పరిమితం కాకుండా ఇతర అంశాలపై తాను వరుసగా జారీచేస్తున్న ఉత్తర్వులను నిలిపివేస్తున్న న్యాయమూర్తులను కూడా 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్'గానే విమర్శిస్తున్నారు. తన ఉత్తర్వులను కోర్టుల్లో సవాల్ చేస్తున్న న్యాయవాదులనూ, న్యాయవాద సంస్థలనూ కట్టడిచేయటానికి చర్యలు తీసుకోవాలనీ అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థలకు ఫెడరల్ నిధులు వెళ్లకుండా నొక్కిపట్టి వాటిని దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. 400 మిలియన్ డాలర్ల నిధులను ఫెడరల్ ప్రభుత్వం నుంచి పొందటానికి ట్రంప్ ప్రభుత్వానికి నచ్చే విధంగా విధానాలను మార్చుకునేందుకు కొలంబియా విశ్వవిద్యాలయం అంగీకరించింది. ఎంతో చరిత్ర ఉండి, మహామహులను అందించిన విశ్వవిద్యాలయానికే ఈ పరిస్థితి వచ్చిందంటే మిగతా వాటి పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ ఆందోళనలు చేయటం, ప్రదర్శనలు నిర్వహించటం గడిచిన రెండేళ్లుగా అమెరికా విశ్వవిద్యాలయాల్లో బాగా జరిగింది. దీన్ని హమాస్ సంస్థకు మద్దతు పలకటంగా భావించి ఆందోళనలో పాల్గొన్న విద్యార్థుల వీసాలను రద్దుచేసి స్వదేశాలకు పంపటమూ మొదలైంది. కొలంబియా యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి రంజనీ శ్రీనివాసన్ అలాగే భారత్‌కు రావాల్సి వచ్చింది. జార్జిటౌన్ యూనివర్సిటీకి చెందిన పోస్ట్ డాక్టరల్ విద్యార్థి బాదర్ ఖాన్ సూరిని కూడా అలాంటి ఆరోపణలతోనే దేశం నుంచి పంపించి వేయటానికి రంగం సిద్ధమైంది. ఇక అనేక ప్రముఖ విద్యాలయాల్లో విద్యార్థులపై నిఘాలు పెరుగుతున్నాయి. విద్యార్థుల సామాజిక ఖాతాలను తనిఖీ చేయటమూ మొదలైంది. అలా తనిఖీ చేసేందుకు కొత్త నిబంధనలు తీసుకురావటానికి ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న వార్తలూ వస్తున్నాయి. సామాజిక సమస్యలపై స్పందించే వారందరూ ఏదో విధమైన సిద్ధాంతాలను విశ్వసించేవారే అయివుంటారు. వారందరినీ లెఫ్ట్ లూనటిక్స్‌గా భావిస్తే విశ్వవిద్యాలయాల్లో అల్లకల్లోలం తలెత్తుంది. భావ వైవిధ్యాన్ని ప్రదర్శించలేని స్థాయికి విశ్వవిద్యాలయాలు దిగజారిపోతే సామాజిక జ్ఞానమే స్తంభించిపోతుంది. అమెరికా విశ్వవిద్యాలయాలకు ఉన్న బలమే భావ వైవిధ్యత. అందుకే అక్కడ జరిగే పరిశోధనలకు అంత గుర్తింపు ఉంటుంది. భారతీయ భాషలు, కులాలు, మతాలు, నగరాలు, ప్రాంతీయ సంస్కృతులు, స్థానిక రాజకీయాలు, ఆర్థిక పరిస్థితులపై అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఎన్నో లోతైన పరిశోధనలు జరిగాయి. వాటిపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ వాటిని పక్కనపెడితే ఏర్పడే జ్ఞానశూన్యత చాలా అసాధారణంగా ఉంటుంది. అందుకే అక్కడ భావప్రకటనలపై కట్టడులు పెడితే జరిగే నష్టం భారత్‌తో పాటు చాలా దేశాలపై ఉంటుంది. రిపబ్లికన్ పార్టీకి ఆధునిక భావాలు అంతగా పట్టవు. మతభావాలపై మక్కువ ఎక్కువ. క్రైస్తవ వాదుల ప్రభావం అధికం. అబార్షన్లను వ్యతిరేకిస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు సమానత్వాన్ని నిరాకరిస్తుంది. పర్యావరణ విధ్వంసం నిజం కాదంటుంది. సమానత్వ భావనను చులకన చేస్తుంది. ఇంత చరిత్ర ఉండబట్టే వామపక్ష భావాల పొడ ఏ మాత్రం గిట్టదు. వాటి పట్ల శత్రుత్వధోరణితో వ్యవహరించటం కొత్తకాదు. ఆ ధోరణి అమెరికన్ చరిత్రలో భయానక పరిణామాలకు కారణమైంది. 1940, 50ల్లో ఆ పార్టీకి చెందిన సెనటర్ జోసెఫ్ రేమండ్ మకార్తీ.. వేలమంది ప్రజలను కమ్యూనిస్టులనే ముద్రవేసి వేధించారు. ప్రభుత్వ వ్యవహారాల సెనెట్ కమిటీకి, దర్యాప్తు ఉపసంఘానికీ అధ్యక్షత వహించి విచారణల పేరుతో భయాన్ని, బీభత్సాన్ని సృష్టించారు. హాలివుడ్ దర్శకులు, నటుల నుంచి మొదలుకుని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కార్మికులు, సైనిక అధికారులు, ఉన్నతోద్యోగులు, శాస్త్రవేత్తలు, కళాకారులు, సాహిత్యవేత్తలు మకార్తీ ఆరోపణలనూ, విచారణలనూ ఎదుర్కోవాల్సి వచ్చింది. మకార్తీ చర్యలను విశ్లేషిస్తూ ఎన్నో రచనలు వచ్చాయి. అమెరికా చరిత్రను వాస్తవిక దృక్పథంతో రాసే వారెవరూ మకార్తీయిజాన్ని విస్మరించలేకపోయారు. మకార్తీ రెండుసార్లే (1946, 1952) సెనెట్‌కు ఎన్నికయ్యారు. విదేశీ వ్యవహారాల శాఖలోకి 57 మంది కమ్యూనిస్టులు చొరబడ్డారని 1950లో ప్రకటించి సంచలనం సృష్టించారు. 'మన ప్రభుత్వంలో కమ్యూనిస్టుల గురించి చర్చించుకునేటప్పుడు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనదగ్గరున్న కొత్త ఆయుధానికి సంబంధించిన బ్లూప్రింట్‌ను దొంగిలించటానికి డబ్బుని తీసుకునే గూఢచారులతో మాత్రమే మనం వ్యవహరించటం లేదు. మన విధానాన్ని తీర్చిదిద్దటానికీ మార్గదర్శనం చేయటానికీ ఉద్దేశించిన దుర్మార్గపు కార్యకలాపాలతో మనం వ్యవహరిస్తున్నాం' అని ప్రకటించారు. ప్రభుత్వంలో చొరబడిన కమ్యూనిస్టులు అమెరికా విధానాలను ప్రభావితం చేసే స్థాయికి చేరారన్నదే ఆ ప్రకటన అంతరార్థం. అంతటితో ఆగలేదు. అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏలో కూడా కమ్యూనిస్టులు ఉన్నారని ఆరోపించారు. ఇతర విభాగాల్లోనూ కమ్యూనిస్టులు తిష్టవేశారని విమర్శించారు. రెండోసారి సెనటర్‌గా ఎన్నికైన తర్వాత ఆరోపణలను మరింత ఉధృతం చేశారు. ప్రభుత్వ కార్యకలాపాల సెనట్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికకావటంతో విపరీత అధికారాలు వచ్చిపడ్డాయి. దానికితోడు శాశ్వతంగా ఉండే సెనట్ దర్యాప్తు కమిటీ నేతృత్వమూ దక్కింది. ఏళ్లపాటు మకార్తీ మాటకీ చేతకీ అడ్డూఅదుపూ లేకుండా పోయింది. వామపక్షవాదులుగా ముద్రలువేసిన వారిపై 36 రోజులపాటు జరిపిన విచారణ టెలివిజన్‌లో ప్రసారం చేయటం అప్పట్లో సృష్టించిన సంచలనం అంతాఇంతా కాదు. న్యూజెర్సీలోని 'ఆర్మీ సిగ్నల్ కాప్స్ ఇంజనీరింగ్ లేబరటరీస్' గూఢచర్యం ఆరోపణలపై జరిపిన విచారణ కూడా టెలివిజన్‌లో ప్రసారమైంది. ఉద్యోగుల విధేయతను పరిశీలించటానికి అప్పట్లో 'లాయల్టీ సెక్యూరిటీ స్క్రీనింగ్ బోర్డు' అనేది ఒకటి ఉండేది. ఆ బోర్డు వేసిన ప్రశ్నలకు జవాబుచెప్పటానికి నిరాకరించిన ఒక డెంటిస్ట్‌ను సైనిక విభాగం నియమించిదంటూ మకార్తీ ఆరోపణ చేశారు. దీంతో ఆగకుండా ఆర్మీ న్యాయవాదిగా వ్యవహరించే జోసెఫ్ వెల్చ్ కమ్యూనిస్టు ప్రజాసంఘం సభ్యుడైన వ్యక్తిని ఉద్యోగంలో పెట్టుకున్నారని ఆరోపించారు. అప్పటికే ఎన్నో ఆరోపణలను చేసి ఒకటిరెండు తప్ప వేటినీ నిరూపించలేని పరిస్థితి ఏర్పడింది. టెలివిజన్ ప్రసారాలతో క్రమేపీ ప్రచార ఆర్భాటమూ, ఆరోపణల డొల్లతనం కనపడడమూ మొదలైంది. 'మీకు సభ్యత అంటూ లేదా సర్? దాన్ని పూర్తిగా వదిలేశారా?' అంటూ వెల్చ్ ఎదురుదాడి చేయటంతో ప్రజలకు కూడా మకార్తీపై విముఖత మొదలైంది. జర్నలిస్టు ఎడ్వర్డ్ ఆర్.మరో తన 'సీ ఇట్ నౌ' కార్యక్రమంలో మకార్తీ వైపరీత్యాన్ని చీల్చిచెండాడారు. దారుణాలన్నీ జరిగిపోయిన తర్వాత, జీవితాలన్నీ నాశనమయ్యాక సెనట్ కూడా మకార్తీని తప్పుపట్టి అభిశంసించింది. 'మెనీ ఆర్ ద క్రైమ్' పేరుతో ఎలన్ ష్రెకర్ ప్రచురించిన పుస్తకంలో మకార్తీయిజం గురించి చాలా విషయాలను ప్రస్తావించారు. మకార్తీయిజం చెలరేగిన కాలంలో రాజకీయ అణచివేత అమెరికన్ చరిత్రలోనే అసాధారణమైందనీ అంతకాలంపాటు అలాంటి దారుణాలు ఎప్పుడూ జరగలేదనీ పేర్కొన్నారు. మకార్తీయిజాన్ని ఒక వ్యక్తికి సంబంధించింది కాకుండా చర్యల ప్రాతిపదికగా చూస్తే 1940, 50ల కాలమంతా ఆ ఇజం రాజ్యమేలిందని చెప్పుకోవచ్చనీ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను నడిపే పెద్దమనుషులు తెలివిడితోనే రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారనీ కమ్యూనిస్టు ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడే పేరుతో దాన్నొక తప్పుగానూ భావించలేదనీ చెప్పారు. విచారణను ఎదుర్కొన్న వారందరూ రాజకీయ అభిప్రాయాలు లేనివారుగానో వామపక్షంతో పూర్తిగా సంబంధంలేనివారుగానో చెప్పలేమనీ ఎలన్ ష్రెకర్ అన్నారు. అయినా దారుణాలను తక్కువ చేయలేమనీ చెప్పారు. మకార్తీయిజం విజృంభణ కాలంలో జులియస్ రోజన్‌బర్గ్, ఎథల్ రోజన్‌బర్గ్ దంపతులకు మరణశిక్షను విధించారు. వందల మందిని జైల్లో పెట్టారు. దేశ బహిష్కారమూ చేశారు. 10 నుంచి 12 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. రష్యా, జర్మనీల్లో జరిగిన దారుణాలతో పోల్చితే ఈ దురాగతాలు తక్కువైనప్పటికీ అవి సృష్టించిన భయానక వాతావరణంతో అమెరికాలో పదేళ్లపాటు అసమ్మతి ఆవిరైపోయిందనీ ఎలన్ ష్రెకర్ వ్యాఖ్యానించారు. 1940, 50ల్లో లాగా కమ్యూనిజం ఇప్పుడు కదం తొక్కటంలేదు. ఆ సిద్ధాంతం ఆధారంగా నడిచే పార్టీల బలం అంతంత మాత్రంగానే ఉంది. అయినా అమెరికాలో 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్' అంటూ ఆ సిద్ధాంత ఛాయలు స్పష్టంగా లేని వారిని సైతం లక్ష్యంగా చేసుకోవటం విచిత్రంగానే అనిపిస్తుంది. ట్రంప్‌కూ ఎలాన్ మస్క్‌కూ లెఫ్టిజంలో ప్రమాదం కనపడుతున్నదంటే రాజకీయ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ ఫుకుయామా 1992లో ఘనంగా ప్రకటించినట్లుగా చరిత్ర అంతం కాలేదని భావించాలి! ప్రత్యామ్నాయ వ్యవస్థలుగా సోషలిస్టు రాజ్యాలు కుప్పకూలిపోవటాన్నీ వామపక్ష భావాల ప్రభావం క్షీణించటాన్నీ చరిత్ర అంతంగా ఫుకుయామా వ్యాఖ్యానించారు. అమెరికా పరిణామాలను చూస్తుంటే ఇంకా అది చల్లారని చరిత్రలాగే ఉంది!

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com